


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162


చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసు.. మాంసం నింపిన బొమ్మలతో కొత్త ఎత్తుగడ!




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 162 | గురువారం 18 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028





# విద్యతోనే జీవితాల్లో మార్పు..

## ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు:

- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం
- విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి
- త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామన్న సీఎం

# రాష్ట్రంలో సంక్షేమం లేదు..

# అంతా సంక్షోభమే

దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది

జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం

సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే

పాలేరు నియోజకవర్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్



## కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే...: కవిత సమాధానం ఏమంటే?



కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదన్న కవిత

బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను మూసేశానని వ్యాఖ్య

తన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్న కవిత

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం

భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ

మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ

ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య

జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ



భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని,




# మాకు అమ్మిన భూమిని ఎలా వేలం వేస్తారు?

ఎకరం రూ.237 కోట్లు పలికిన రాయదుర్గం భూముల్లోని ఐదు ఎకరాలు మావే

- 2010లో 13.33 కోట్లకు - ప్రభుత్వం మాకు విక్రయించింది
- భూమి మా పొజిషన్‌లోనే.. అభివృద్ధికి కోట్లు ఖర్చు చేశాం
- అక్కడ మా ఆఫీసుల కోసం ట్విన్ టవర్లు ప్రతిపాదించాం
- పైపెవర్లు, కొవిడ్‌తో పాటు అనుమతుల్లో ఆలస్యంతో జాప్యం
- గతంలో కూడా అప్పటి ప్రభుత్వం ఈ భూమిపై కన్నేసింది
- నాటి ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టేసింది
- ఇప్పుడు వేలం వేయడంకోర్టు ధిక్కరణే అవుతుంది
- హైకోర్టును ఆశ్రయించిన ఎస్బీఐ - నేడు విచారించనున్న కోర్టు

రాయదుర్గంలో ఇటీవల ఎకరం రూ.237 కోట్ల రికార్డు ధర పలికిన 6.29 ఎకరాల భూమిలో ఐదెకరాలు తమవేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) పేర్కొంది. గతంలో తమకు అమ్మిన భూమిని తమకు చెప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎలా వేలం వేస్తుందంటూ హైకోర్టును ఆశ్రయించింది. వేలం ఆపాలని గతంలో దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు మొత్తం మూడు వేర్వేరు పిటిషన్లు వేసింది. ఇవి గురువారం జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఎదుట విచారణకు రానున్నాయి. ఆ భూమి తమదేనని ఎస్బీఐ చెప్పడం సంచలనం సృష్టిస్తోంది. రాయదుర్గంలోని హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో సర్వే నం. 83/1లో ఐదెకరాల ప్లాటు (20,239 చదరపు మీటర్లు) ప్లాట్ నెంబర్ 1(ఏ)ను వేలానికి పెట్టడంపై ఎస్బీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సదరు భూమిని వేలంలో దక్కించుకున్న గౌరా వెంచర్స్‌కు ఎలాంటి హక్కులు లభించవని పిటిషన్‌లో పేర్కొంది. సదరు ఐదెకరాలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తమకు విక్రయించిందని, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2010లోనే రూ.13.33 కోట్లకు వాటిని కొనుగోలు చేసినట్లు తెలిపింది. అప్పుడు ప్రభుత్వంతో జరిగిన ఒప్పందంలో తిరిగి భూమిని తీసుకునేలా ఎలాంటి నిబంధనలు లేవని పేర్కొంది. ఇటీవల మే 20న సదరు భూమిలో నిర్మాణాలు చేపట్టలేదు కాబట్టి కేటాయింపును రద్దు చేస్తున్నట్లు లెటర్ జారీ చేశారని, అది తమకు అందలేదని తెలిపింది.

# నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు..



# రెండో విడతలో

## గుడిసెవాసులకు ప్రాధాన్యం

75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

# నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు..

**నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం**

**జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా ఆంక్షలు విధిస్తూ కేంద్రం నిర్ణయం**

**ఇది దొంగను వదిలి బాధితుడికి తాళం వేయడమేనన్న రాహుల్ గాంధీ**

**చీటింగ్ మాఫియాను అరికట్టేందుకే ఈ చర్య అని చెబుతున్న ప్రభుత్వం**

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలను, చీటింగ్ నెట్ వర్క్‌లను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న పరీక్ష జరగనున్న నేపథ్యంలో, జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "దొంగను పట్టుకోవడం చేతకాక, బాధితుడి ఇంటికి తాళం వేసినట్లుంది" అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇదొక కొత్త ఉపాయాన్ని కనిపెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. అసలైన పేపర్ లీక్ మాఫియాను విడిచిపెట్టి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు తమ నోట్స్, టెస్ట్ సిరీస్‌ల కోసం టెలిగ్రామ్‌పైనే ఆధారపడతారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సమర్థించుకుంది. వ్యవస్థీకృత చీటింగ్ ముఠాలు రీ-టెస్ట్‌లో మోసాలకు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా నిరోధించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్ష పత్రాల భద్రతను పర్యవేక్షించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సహాయాన్ని కూడా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. టెలిగ్రామ్ నిషేధంపై ఆ సంస్థ సీఈఓ పావెల్ డ్యూరోవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు చేసే తప్పులకు భారత్‌లోని 15 కోట్ల మంది వినియోగదారులను శిక్షించడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించినప్పటికీ, ఇప్పటికే మొబైల్స్‌లో యాప్ ఉన్నవారు వీపీఎన్ సాయంతో దీనిని యాక్సెస్ చేస్తున్నారు. గత మే నెలలో జరిగిన నీట్-యూజీ పరీక్ష పత్రం లీకైనట్లు వచ్చిన ఆరోపణలతో పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రీ-ఎగ్జామ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, ఈ తాత్కాలిక నిషేధంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

# విద్యతోనే జీవితాల్లో మార్పు..

తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు.రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు.విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు.క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు..అంతా సంక్షోభమే

రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమిషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా

వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఏ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు

# కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే... కవిత సమాధానం ఏమంటే?

తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ద్వారానే సరికొత్త చరిత్రను లిఖిస్తానని ఆమె ఉద్ఘాటించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కవిత, ఒకవేళ కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చారు. "ఖచ్చితంగా ఆ అధ్యాయం ముగిసింది. జీవితంలో కొన్నిసార్లు పేజీలు తిప్పాలి, మరికొన్నిసార్లు పుస్తకాలనే మూసివేయాలి. నేను బీఆర్ఎస్ అనే పుస్తకాన్ని ఎప్పుడో మూసివేశాను" అని ఆమె పేర్కొన్నారు.గత ఏడాది సెప్టెంబర్‌లో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. బీఆర్ఎస్ పాలనలో తనకు అనేక చేదు అనుభవాలు ఎదురయ్యాయని, సామాజిక న్యాయం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు వంటి హామీలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయిందని కవిత విమర్శించారు. ప్రాంతీయ భావజాలం నుంచి బీఆర్ఎస్ వైదొలగడం వల్లే ప్రజలకు దూరమైందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీయే తమ ప్రధాన ప్రత్యర్థి అని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. ఇక ఢిల్లీ మద్యం కేసులో తనపై దిగువ కోర్టులో ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, ఈడీ, సీబీఐ అప్పీళ్ల అంశాన్ని న్యాయవ్యవస్థకే వదిలేస్తున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

## యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

## ఎపిలో విస్తరించిన ద్రోణి

తూర్పు విదర్భ - తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ ద్రోణి ప్రభావంతో గురువారం రాష్ట్రంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. కోస్తాంధ్ర జిల్లాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని సూచించింది. బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేసింది. ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని రైతులు, కూలీలు, పశువుల కాపరులకు విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.ఘాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని వివరించింది. విజయనగరం జిల్లా వేపాడలో అత్యధికంగా 96.7 మిల్లీమీటర్లు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 72 మి.మీ, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో 69.01 మి.మీ, నర్సీపట్నంలో 66.5 మి.మీ., వజ్రపు కొత్తూరులో 65.8 మి.మీ., నంద్యాల జిల్లా టంగుటూరులో 64.4 మి.మీ., అనకాపల్లి జిల్లా బలిఘట్టం, రావికమతంలో 57.7 మి.మీ.

# ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**జూనియర్ విద్యార్థులతో వెట్టి చేయించిన సీనియర్లు**

**12మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్**

హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ ఉదంతం కలకలం రేపింది. దీనిపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడ్డ పలువురు విద్యార్థులను ఆరునెఉలలపాటు బహిష్కరించినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ వెల్లడించారు. జూన్ తొమ్మిదో తేదీన కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బీడీఎస్ విద్యార్థులు తమపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కాలేజీ యాజమాన్యం, ఆ రోజే సదరు ఫైల్ ఇయర్ విద్యార్థులను పిలిపించి గట్టిగా మందలించింది. అయితే, యాజమాన్యం హెచ్చరించిన 24 గంటలు తిరగకముందే సీనియర్ విద్యార్థులు మరోసారి ర్యాంకింగ్‌కు పాల్పడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి ర్యాగింగ్‌కు పాల్పడిన మొత్తం 12 మంది విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. 'జూనియర్లతో సీనియర్లు ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడంతో పాటూ కూలర్లలో నీళ్లు నింపడం వంటి పనులు చేయిస్తూ వేధించేవారు. ర్యాగింగ్ భయంతో మూడో సంవత్సరం చదువుతున్న కొందరు బాధితులు హాస్టల్ గదుల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిపోయారు. ర్యాగింగ్‌కు పాల్పడిన థర్డ్ ఇయర్ విద్యార్థులపై గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన హాస్టల్లోని సీసీ కెమెరాలను పగలగొట్టడమే కాకుండా, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఆ సమయంలో వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వగా, సదరు విద్యార్థులు యాజమాన్యానికి క్షమాపణలు చెప్పి, మరోసారి ఇలాంటి తప్పులు చేయబోమని నమ్మించారు. కానీ, వాళ్ల బుద్ధి మారలేదు.. మరోసారి అదే తరహా ప్రవర్తనతో జూనియర్లను వేధించారు. ఈ క్రమంలోనే 12 మంది విద్యార్థులను సస్పెండ్ చేశాం అని తెలిపారు. అలా చేయడం వల్ల పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ఉంటుందని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయం అని అన్నారు. ఇది వారికి గుణపాఠం కావాలన్నారు. అలాగే మిగతా వారికి ఓ హెచ్చరిక అన్నారు. ఇదిలావుంటే ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకిదిగారు.

## 2వేల కోట్ల బడ్జెట్ లేకుండా అంత స్కామ్ సాధ్యమా

**హరీష్ వ్యాఖ్యలపై పొన్నం ఆగ్రహం**

తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ.2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కాం జరిగిందని ఎలా అంటారుని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. బలహీన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, అలాంటి వర్గాలను మాటలతో కించపరచే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం

త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు. ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## మాకు అమ్మిన భూమిని ఎలా వేలం వేస్తారు?

నిర్మాణాలు పూర్తిచేయడానికి మరింత సమయం ఇవ్వాలని కోరినా తిరస్కరించారని పేర్కొంది.తాము ఇచ్చిన ఆధారాలు, రికార్డులతో పాటు హైకోర్టు తీర్పులను పరిశీలించకుండా ఏకపక్షంగా రాష్ట్ర పభుత్వం, టీజీఐఐసీ నిర్ణయాలు తీసుకున్నాయని తెలిపింది. ఆ భూమిలో ఎస్బీఐ కార్పొరేట్ కార్యాలయాలు, శాఖలు, ఇతర కార్యాలయాల కోసం ట్విన్ టవర్ భవనాన్ని ప్రతిపాదించామని పేర్కొంది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులు, మార్గదర్శకాల ప్రకారం టెండర్లు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఆ ప్రాంతంలో ఫ్లైఓవర్లు రావడం, కొవిడ్ మహమ్మారి, జీహెచ్ఎంసీ వంటి ప్రభుత్వ సంస్థల అనుమతుల్లో ఆలస్యంతో నిర్మాణాలు కొంత జాప్యమైనట్లు పేర్కొంది. తమతో పోలిస్తే అక్కడ భూమి పొందిన ఇతర ఏ సంస్థలు అసలు నిర్మాణాలే ప్రారంభించలేదని పేర్కొంది. అక్కడ ఎవరికీ కేటాయించని ప్లాట్లు ఉన్నాయని, వాటిని వదిలేసి తమకు విక్రయించిన భూమిని వేలం వేయడం ఏంటని ప్రశ్నించింది. అధికారం ఉందని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం తమ హక్కులను కాలరాయలేదని, చట్టాన్ని ఉల్లంఘించలేదని పేర్కొంది. కోర్టుల న్యాయసమీక్ష అధికారం నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదని వ్యాఖ్యానించింది.

**హైకోర్టు ఇప్పటికే కొట్టేసింది** తమకు కేటాయించిన ఈ భూమిపై ప్రభుత్వం గతంలోనే కన్నేసిందని, నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకోవడంతోపాటు కేటాయింపు రద్దు చేయాలని చూసిందని ఎస్బీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. 2021లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని హైకోర్టు 2022లో కొట్టేసిందని తెలిపింది. మరోసారి సైతం కేటాయింపు రద్దు చేయాలని ప్రభుత్వం చూసిందని, అయితే 2024లో తన పిటిషన్‌ను స్వచ్ఛందంగా ఉపసంహరించుకుందని గుర్తుచేసింది. మళ్లీ మూడోసారి రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీలు సదరు భూమిని వేలానికి పెట్టడం అక్రమమే కాకుండా చట్టవ్యతిరేకమైన ఏకపక్ష చర్య అని, కోర్టు ఉత్తర్వుల ధిక్కరణకు పాల్పడటమేనని తెలిపింది. వాస్తవానికి ఈ భూమి కేటాయింపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్(ఎస్బీహెచ్)కు జరిగిందని, ఆ సంస్థ ఎస్బీఐలో విలీనమైందని పేర్కొంది. 2011లో విక్రయ ఒప్పందం జరిగిన రోజే సదరు భూమిని స్వయంగా ప్రభుత్వమే తమకు అప్పగించిందని తెలిపింది. అక్కడ తలపెట్టిన ట్విన్ టవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రూ.21.50 కోట్లు అభివృద్ధి, ప్రహరీ, ఇతర చార్జీలు, ఫీజుల కోసం ఖర్చు పెట్టినట్లు వివరించింది. ఈ ప్రాజెక్టు ఇప్పటికే ప్రారంభమైందని, అన్ని అనుమతులు చూపించినా తదుపరి సమయం ఇవ్వకుండా ప్రభుత్వం అక్రమంగా వేలం నోటీసు జారీ చేసిందని పేర్కొంది.

# ధ్యానం ఆందోళన అదుపుకు దివ్యౌషధం

**నంది పత్రిక:** ఆధునిక మానవ జీవితం శాస్త్ర సాంకేతికంగా ఎంతముందుకువెళుతున్నప్పటికీ అంతకంటే ఎక్కువగా మానసిక ఒత్తిడికి గురౌతుంది. ఉరుకుల పరుగుల జీవితం పోటీ ప్రపంచం ఉద్యోగ వ్యాపారాల్లో సవాళ్లు మనిషిని నిరంతరం ఆందోళన ఒత్తిడి వైపు నెట్టుతున్నాయి. మానసిక రుగ్మతల నుండి ఉపశమనం పొందేందుకు ధ్యానం గొప్ప ఆయుధం.మానసిక ఆరోగ్యస్థితినిమెరుగు పరుచుకోవడానికి వైద్యసౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీఅన్నింటికంటేసహజమైన సురక్షితమైన రూపాయి ఖర్చు లేని ఏకైక మార్గం ధ్యానం.ధ్యానం శారీరక మానసికలిఆరోగ్యానికి దివ్యౌషధంలిప్రాచీన కాలము నుండి భారతదేశంలో ఋషులు మునులు ఆచరించిన జీవన విధానమే ధ్యానం. యోగ ధ్యానం నేడు ప్రపంచ వ్యాప్తంగా మానసిక శారీరకఆరోగ్యానికి ఒక దివ్యఔషదంగా శాస్త్రీయంగానిరూపించబడింది.ధ్యానం మొదట్లో కష్టం అనిపించిన తర్వాత ధ్యాన సాధన ధ్యానం సామర్థ్యాన్నిపెంచుతుంది .ధ్యానం చేయడంవల్లగతాన్నిమర్చిపోయివర్ధమానజీవితంలోముందుకుసాగడానికి కావలసిన సామర్థ్యాన్ని సమకూర్తుంది.లిసాకులు వద్దు ధ్యానం ముద్దులినాకు ధ్యానం చేయడానికి సమయం లేదు. చేయాలని ఉంది వీలు కావడం లేదు ధ్యానం నేను చేయలేను అని చాలా మంది సాకులు చెబుతారు. ఇక్కడ చెల్లని రూపాయికి గీతలు ఎక్కువ చాతగానివానికి మాటలు ఎక్కువ అనే సామెత గుర్తుకొస్తుంది. నాకు శ్వాస తీసుకోవడానికి సమయం లేదని ఎవరు చెప్పరు. శ్వాస తీసుకోకపోతేమనిషి జీవించలేడు .సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ధ్యానం ప్రాణాయామం ముఖ్యమైనవిఈ మూడు మానవుణ్ణి అన్ని రకాల వ్యాధుల నుండి దూరంగాఉంచుతాయి.లిఆందోళనలు ధ్యానంలిఆందోళన కలిగినప్పుడు మెదడులో ఆలోచనల వేగం విపరీతంగా పెరుగుతుంది. భవిష్యత్తు గురించి భయం గతం గురించిన నిరాశమనిషినిచుట్టుముడుతాయి.ఈ స్థితిలో మెదడులో ఫైట్ అర్ ఫ్లైట్ వ్యవస్థయాక్టివేట్అవుతుంది.

దీనిని ధ్యానం ద్వారా అదుపు చేయవచ్చును.లికార్టిసోల్ హార్మోన్ నియంత్రణలిఒత్తిడి సమయంలో శరీరంలో కార్టిసోల్ హార్మోన్ రిలీజ్ అవుతుంది. ధ్యానంచేయడం వల్లఈ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది.



ఆల్ఫా తరంగాల ఉత్పత్తిలిధ్యానంలో ఉన్నపుడు మెదడులో ఆల్ఫా తరంగాలు ఉత్తేజితమై మనసుకు ప్రశాంతత స్థిరత్వాన్ని చేకూరుస్తాయి.లిధ్యానం ప్రస్తుత క్షణం పై దృష్టిలిప్రస్తుతక్షణంపైదృష్టి పెడుతుంది. ధ్యానం మనల్ని గతం నుండి భవిష్యతు నుండి తప్పించి ప్రస్తుత క్షణం మీద దృష్టిపెట్టేలా చేస్తుంది. ధ్యానం వల్ల అనవసరపు భయాలు ఊహలు అనుమానాలు తొలిగిపోతాయి.లిధ్యానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలులిధ్యానం కేవలం మానసిక ప్రక్రియ మాత్రమే కాదు .శారీరక వ్యవస్థ మొత్తాన్ని సమతుల్యతలోకి తెస్తుంది.లిరక్తపోటు నియంత్రణలిధ్యానం వల్ల నరాల వ్యవస్థ బలపడి రక్తనాళాలు రిలాక్స్ కావడం వల్ల రక్త ప్రసరణను సాఫీగా మార్చుతుంది .అధిక రక్తపోటును తగ్గిస్తుంది.లిగుండె ఆరోగ్యం మెరుగు

ధ్యానం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి గుండెపై అదనపు బారం తగ్గుతుంది. ధ్యానం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.లిరోగనిరోధక శక్తిపెరుగుతుందిలినిరంతర ధ్యానం చేసే వారిలో వ్యాధినిరోధక శక్తి కణాలు చురుకుగా పనిచేస్తాయి. ధ్యానంవల్ల శరీరాన్ని ఇన్ఫెక్షన్స్ వైరస్ ల బారి నుండి రక్షిస్తుంది.లిదీర్ఘకాలిక నొప్పుల నుంచి ఉపశమనంలిధ్యానం వల్ల కీళ్ల నొప్పులు మైగ్రేన్ తలనొప్పి వెన్ను నొప్పి లాంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ధ్యానం సహజ నివారిణిగా పనిచేస్తుంది. నొప్పిని భరించే మానసిక స్థితిని ఇస్తుంది. లితీవ్రమైన నిరాశ నివారణలినిరంతరం ధ్యానం చేయడం వల్ల ప్రతికూల ఆలోచనలతో బాధపడే వారిలో ధ్యానం సానుకూల దృక్పథాన్ని నింపుతుంది. డిప్రెషన్ తగ్గుతుంది. మానసికకుంగుపాటుతగ్గుతుంది.ఏకాగ్రత పెరుగుతుంది.లిఏకాగ్రత జ్ఞాపక శక్తి పెరుగుతుందిలిఉద్యోగులకు విద్యార్థులకుధ్యానంఉపయోగపడుతుంది.ఏకాగ్రత జ్ఞాపక శక్తి పెరిగి తార్కికత పరిశోధన పరిశీలన సామర్థ్యాన్ని పెంచుతుంది. నిద్ర లేమి వారికి ధ్యానం ఒక వరం. ధ్యానం ఆలోచన రహిత స్థితికి తీసుకు వెళ్ళి హాయిగా ప్రశాంతంగా నిద్రపట్టేట్లు చేస్తుంది.భావోద్వేగాల నియంత్రణలిచిన్న విషయాలకే కోపానికిరావడం చిరాకు పడడం ఏడవడం లాంటి భావోద్వేగాలను అదుపుచేస్తుంది.ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మనిషిలో స్థితప్రజ్ఞతతో వ్యవహరించే శక్తి పెరుగుతుంది.లివ్యసనాల నుండి విముక్తిలిధ్యానం వల్ల ఆత్మవిశ్వాసం స్వయం నియంత్రణ శక్తి పెరుగుతుంది. ధూమపానం మద్యపానం డ్రగ్స్అబ్యూస్ మితిమీరిన డిజిటల్ ఎడిక్ట్ లాంటి చెడు అలవాట్ల నుండి బయటపడడానికి ధ్యానం మానసిక బలాన్ని ఇస్తుంది.లిధ్యానం శాంతి

ధ్యానం శాంతి కరుణ ఐక్యత పరోపకారం సహకారం సహనం పెంచి పోషించడంలో శక్తివంతమైన సాధనం..ధ్యానం గొప్ప ఆయుధం

సమాజంలో సామరస్యం సమరసత సంఘీభావం సమతా మమత మానవీయ విలువలపై చైతన్యం కలిగించి స్థిరమైన ప్రపంచాన్ని నిర్మించడానికి ధ్యానం గొప్ప ఆయుధం.గుణాత్మక మార్పులులిధ్యానం మనిషి శారీరక మానసిక ఆరోగ్యంలో గుణాత్మక మార్పులు తెస్తుంది.ధ్యానం వల్ల సమయ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచి మనసుకు తక్షణమే శక్తిని అందిస్తుంది. ధ్యానం మనిషిని ఆరోగ్యంగా ఉంచుతుంది. పెరుగుతున్న ఒత్తిడి ఆందోళన క్షీణిస్తున్న సంబంధాలు విశ్వాసం నమ్మకం సమాజంలో పెంచుతుంది.నేదునూరి కనకయ్య అధ్యక్షులు

తెలంగాణ ఎకనామిక్ ఫోరం

సలహాదారులుఅత్తాపూర్ యోగ సెంటర్ హైదరాబాద్.

## రైతులకు ఎరువుల పంపిణీ విధానంపై అవగాహన కల్పించేందుకు పోస్టర్ల విడుదల..!





**వై ఎస్ ఆర్ కడప, బ్యూరో చీఫ్ జూన్ 17 నంది పత్రిక:** రైతులకు ఎరువుల పంపిణీ విధానం, ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ వినియోగం,యూరియా, డీఏపీ పంపిణీ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన సమాచార పోస్టర్లను.. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రైతులు ఏపీ ఏ ఐఎంఎస్ యాప్ ద్వారా తమ పంటల వివరాలను నమోదు చేసుకోవడం, రైతు సేవా కేంద్రాలు (ఆర్ ఎస్ కె ) ద్వారా ఎరువులు పొందడం, ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంపొందించడం వంటి అంశాలపై పోస్టర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మండలంలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల ఆర్థిక దోపిడీని అరికట్టాలి

### విద్యను సామాన్య మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి

### యూనిఫామ్, బుక్స్, షూ, టై, బెల్టు, లను స్కూల్లో విక్రయించే విద్యా సంస్థలను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యన్న.ఉదయ్




**బేతంచెర్ల జూన్ 17( నందిపత్రిక ).** బేతంచర్ల మండలంలో సామాన్య, పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, స్థానిక బేతంచెర్ల పట్టణలోని సీపీఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్ అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యన్న.ఉదయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ,విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే, కేవలం ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా మేము నిర్ణయించిందే ఫీజు అని లక్షల రూపాయలను తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు యూనిఫామ్, బుక్స్, షూ, టై, బెల్టు, విద్యాసంస్థలను అంగళ్లుగా మార్చి వ్యాపారం నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో నిద్ర పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస మౌలిక వసతులు, అర్హులైన ఉపాధ్యాయులు లేకుండానే, ఎన్నికల ప్రచారం తలపించే విధంగా రంగు రంగుల కరపత్రలతో అసత్య ప్రచారాలు నిర్వహిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని అరికట్టి,యూనిఫామ్, బుక్స్, షూ టై బెల్టు లను విక్రయించే విద్యాసంస్థలను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎల్లకృష్ణ, మధు, గౌరీ ఉదయ్, ఖదీర్, మహమ్మద్, మధుకుమార్, శివ, హమీద్, విష్ణు, మురళి, ఉపేంద్ర, మల్లికార్జున, పాల్గొన్నారు.

# అన్నదాతకు ఖరీఫ్ కష్టకాలం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 17:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతుల పాలిట కష్ట కాలంగా మారబోతోందా? అవును నిజమే.. అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. దేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందని పరిశీలకులు శాస్త్రవేత్తలు అంచనాలు వేస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితలంలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే ఒక వాతావరణం దృగ్విషయం. సముద్రంలో వాణిజ్య పవనాలు బలహీన పడటం కారణంగా ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం లో తీవ్ర మార్పులకు కారణం అవుతూ ఉంది. ఇలాంటి కారణాలు ఏవి తెలియక రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తూ ఉండటం, అన్నదాతల అమాయకత్వానికి అద్దం పడుతూ ఉంది. అదీకాక గత ఏడాది ఖరీఫ్ సీజన్ లో ఎరువుల కొరత కారణంగా పడిన ఇబ్బందులను, అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఇప్పటినుండి అధికంగా ఎరువులను కొనుగోలు చేసుకుని ఇళ్లలో నిలువ ఉంచుకుంటున్నారు. ప్రతి ఏటా జూన్ 15 నుండి ఖరీఫ్ సీజన్ ఆరంభం అవ్వడం సర్వసాధారణంగా జరుగుతూ ఉంది. గత ఏడాది ఖరీఫ్ సీజన్లో విపరీతంగా వర్షాలు కురియడంతో, శ్రీశైలం ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు చేరడం వల్ల, సీజన్ కు 15 రోజుల ముందు రైతులు వరి నాట్లను వేసుకున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జూన్లో సాధారణ వర్షపాతం 93.9 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు 21. 6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు అయింది. జూలైలో 105, ఆగస్టులో 129 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఎలినో ప్రభావం కారణంగా ఈ రెండు నెలలలో వర్షాలు కురిసే పరిస్థితులు లేవని వ్యవసాయ శాఖ పేర్కొంటూ ఉంది. బండి ఆత్మకూరు మండలంలో చెరువుల క్రింద 608 హెక్టార్లలోను, తెలుగు గంగ ప్రాజెక్టు , కర్నూలు కడప కాల్వ కలిపి 11,828 హెక్టార్లలలోను, బోర్ల కింద 969 లోను, మొత్తం కలిపి దాదాపు 18 హెక్టార్లలో రైతులు వరిని సాగు చేస్తూ ఉన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా రైతులు బోర్ల కింద డ్రై షోయింగ్ విధానం ద్వారా వరిని సాగు చేసుకోవాలని



వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అపర పంటలు, కొర్ర,సజ్జ, రాగులు లాంటి పంటలు వేసుకుంటే రైతులకు ఆదా అవుతుందని, ఖర్చు కూడా బాగా తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ బుధవారం పేర్కొన్నారు. ఈ పంటలకు భూమిలో అదును ఉంటే సరిపోతుందని, ప్రస్తుతం మార్కెట్లో కొర్ర, సజ్జ, రాగులు లాంటి పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, అదిగాక 60 రోజులకే పంట చేతికి వస్తుంది కాబట్టి, రైతులు ఆ దిశగా ప్రయత్నాలు చేసి అపరాల పంటల సాగుకు పూనుకుంటే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు.

# ఫలించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి

### నసనకోట ఎం.జె.పి బాలికల పాఠశాలలో ఇక నుంచి ఇంటర్మీడియట్

### జీ.ఓ విడుదల చేసిన ప్రభుత్వం.. అడ్మిషన్లు ప్రారంభం

### సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే సునీత కృతజ్ఞతలు

### మా ప్రాంత విద్యార్థినులకు ఇది వరం లాంటిదన్న సునీత

**అనంతపురం బ్యూరో చీఫ్ జూన్ 17 నంది పత్రిక** రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి ఫలించింది. వెనుకబడిన ప్రాంతమైన రామగిరి మండలంలో విద్యార్థినులకు ఇక నుంచి ఇంటర్మీడియట్ స్థానికంగానే చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించారు. నసనకోట ఎంజేపీ బాలికల పాఠశాలను ఇంటర్మీడియట్ కు అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. రామగిరి ప్రాంతంలో చాలా ఏళ్లుగా పదవ తరగతి వరకు మాత్రమే విద్యార్థినులు చదువుకునే అవకాశం




ఉండేది. రెసిడెన్షియల్ విద్య లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పదవ తరగతి తర్వాత చదువు మాన్పించే పరిస్థితి కనిపించేది. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే పరిటాల సునీత పరిటాల రవీంద్ర ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు అవకాశం కల్పించాలని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు పలు సార్లు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఆమె ఎంతో కృషి చేశారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం జీఓ నెం.6ను విడుదల చేసింది. జీ.ఓ ప్రకారం ఈ విద్యాసంత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. ఎంపీసీ-40, బైపిసి-40 సీట్లతో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచే ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరణ మొదలైంది. 10వ తరగతిలో 5వందలు ఆపై మార్కులు వచ్చిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నసనకోట ఎంజేపి బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ అన్నది ఈ ప్రాంత ప్రజల కల అని అన్నారు. ఇందుకోసం తాము చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. గతంలో విద్యార్థినులు 10వ తరగతి తర్వాత చదువు మానేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు స్థానికంగానే ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం వచ్చిందన్నారు. ఇప్పటికే ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు చదువుల్లో రాణిస్తున్నారని.. పదవ తరగతిలో కూడ మంత్రి మార్కులు సాధించారన్నారు. ఇంటర్మీడియట్ లో కూడా ఈ పాఠశాల రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండేలా చూడాలని అధ్యాపకులకు ఎమ్మెల్యే సునీత సూచించారు....



# చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ ని త్వరితగతిన కనిపెట్టండి

### మహిళలను చిన్నారులను కాపాడడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి



**కర్నూలు ప్రతినిధి. జూన్ 17 . (నంది పత్రిక ):** మహిళలపై చిన్నారులపై జరుగుతున్న మిస్సింగ్ కేసులను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నంది విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ జ్ఞానేశ్వరి అనే చిన్నారి మిస్ అయ్యి దాదాపుగా పది రోజులు అవుతున్న ఇప్పటికి ఆచూకీ తెలియక పోవడం చాలా బాధాకరం అని ఆమె అన్నారు.రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఉన్నప్పటికీ మహిళల మిస్సింగ్ కేసుల్లో కానీ మహిళల కు సంబందించిన కేసుల్లో గాని ఎటువంటి సత్వర న్యాయం లభించడం లేదని ఆమె అన్నారు. గత సంవత్సరంలో కర్నూలు జిల్లాలో కూడా భారతీ అనే అమ్మాయి మిస్సింగ్ కేసు ఈరోజుకి చేదించలేకపోయారు. అలాగే 10 రోజులక్రితంతప్పిపోయినటువంటి చిన్నారి బాలికను కూడా ఈరోజుకి గుర్తించకపోవడం బాధాకరమని ఆమె అన్నారు.కనీసం బాధితులకు భరోసా ఇచ్చి వారిని పరామర్శించిన దాఖలాలు కూడా కనిపించడం లేదని రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్నటువంటి హింసను అరికట్టడం పోగొట్టి రాజకీయ నాయకులు వ్యక్తిగత విమర్శలతో కాలయాపన చేయడం సిగ్గుపడాల్సిన విషయం అని ఆమె అన్నారు.ఇప్పటికైనా మహిళలపై చిన్నారులపై జరుగుతున్న దాడులు మిస్సింగ్ కేసులను పరిష్కరించడంలో నిర్లక్ష్యాన్ని వీడి ప్రజలకు న్యాయం చేసే విధంగా బాధితులకు అండగా ప్రభుత్వాలు నిలిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు.

# గ్రామీణ యువత స్వయం ఉపాధికి కొత్త దిశగా

# ఆర్ఎస్ఈఎస్‌టీఐ కేంద్రం ప్రారంభం





## నైపుణ్యాభివృద్ధితో స్వావలంబన లక్ష్యం - ఆర్ఎస్ఈఎస్‌టీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## యువత, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆర్ఎస్ఈఎస్‌టీఐ కీలక వేదిక

**నంద్యాల బ్యూరో, జూన్ 17(నంది పత్రిక):-** గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఈఎస్‌టీఐ శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కర్నూల్ రీజినల్ హెడ్ డి. అనిల్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని శిక్షణా సదుపాయాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి" అని పిలుపునిచ్చారు. "ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల సహకారంతో గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా యువతను స్వయం ఉపాధి వైపు మళ్లించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకుల ఆర్థిక సహకారం మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణలను సమన్వయం చేస్తూ గ్రామీణ నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాలను చూపడంలో ఆర్ఎస్ఈఎస్‌టీఐ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అన్నారు. శిక్షణ పొందిన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని సూచించారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు డా. బైరెడ్డి శబరి మాట్లాడుతూ, ద్వారా గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి, బ్యాంకు రుణ సహాయంతో స్వయం ఉపాధి కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సంస్థ ద్వారా మరింత మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని అన్నారు. గ్రామీణ యువతకు ఉచితంగా వృత్తి, నైపుణ్య శిక్షణ అందించి, అనంతరం బ్యాంకుల రుణ సహాయంతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ఆర్ఎస్ఈఎస్‌టీఐ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలో మరింత మంది యువత, మహిళలు ఆర్థికంగా బలోపేతమై తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ డి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, "సమాజంలోని బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం యూనియన్ బ్యాంక్ కట్టుబడి ఉందన్నారు. నంద్యాల ద్వారా రైతులు, మహిళలు, సభ్యులకు నైపుణ్య శిక్షణ అందించి వారిని ఆర్థికంగా స్వావలంబన చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, బి అరుణకుమారి, శిక్షకులు, సిబ్బంది, శిక్షణార్థులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు పునః ప్రారంభం : ప్రిన్సిపల్ డాక్టర్. సామ్యూల్ డేవిడ్ రాజ్




**పోరుమామిళ్ల జూన్ 17: (నంది పత్రిక )**స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు 18/6/2026 నుండి అధికారికంగా ప్రారంభం కానున్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సామ్యూల్ డేవిడ్ రాజ్ తెలిపారు. కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ కోర్సులు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలు కల్పించబడతాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. స్థానిక యువత ఎక్కువ సంఖ్యలో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రిన్సిపల్ డాక్టర్ సామ్యూల్ డేవిడ్ రాజ్ కోరారు.

# విద్యా హక్కు చట్టం ప్రకారం 25% ఉచిత విద్య ఇవ్వని స్కూల్స్ పై చర్యలు తీసుకువాలి.

## జిల్లా ఇంచార్జి మంత్రి సవితా గారికి వినతిపత్రం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్



జిల్లా లోని కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్ విద్య హక్కు చట్టం ప్రకారం 25% ఉచితంగా సీట్లు ఇవ్వకుండా వున్నా వాటి పై చర్యలు తీసుకోవాలని ‾ూ×దీూఖ రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్ అన్నారు. బుధవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత గారిని కలిసి ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతు విద్యా హక్కు చట్టం అమలులో ప్రధానగా డిఇఓ షంసుద్దీన్ నిర్లక్ష్యం ఉండన్నారు. ఈ చట్టం అమలు పై ఇ ఒక్క స్కూల్ కూడా తనిఖీ చేయలేదని అన్నారు. ఇవే కాకుండా కడప జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ ఈ విద్యా సంవత్సరం విపరీతంగా ఫీజులు పెంచారన్నారు. వాటి కట్టడి చేయాలని, ఇప్పటికే ఒక్కో విద్యార్థి దగ్గర లక్ష రూపాయల వసూలుకు స్కూల్ యాజమాన్యం లి సిద్ధమయ్యన్నారు. అధిక స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ రవాణా ఛార్జ్ లంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచులోంటున్నారానర్.. ఇంత జరుగుతున్న ప్రధాన భాద్యుడుగా వున్నా డిఇఓ షంసుద్దీన్ మాత్రం ఏ ఒక్క స్కూల్ తనిఖీ చేయలేదని, ఆయన పైన విచారన చేసి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా విద్యా హక్కు చట్టం పాటించని స్కూల్స్ పైన చర్యలకు తీసుకువాలని కోరారు.

# శాంతినికేతన్ హై స్కూల్ నందు "శక్తి యాప్" అవేర్నెస్ ప్రోగ్రాం

## "శక్తి టీం"సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ షేక్ నూర్ అహ్మద్ మరియు డబ్ల్యు హెచ్ జి సుప్రియ.



**నంది పత్రిక ఆత్మకూరు...** నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డి.ఎస్.పి రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు టౌన్ లోని గరీబ్ నగర్ వీధిలో ఉన్న శాంతినికేతన్ హై స్కూల్ నందు హై స్కూల్ కరస్పాండెంట్ టీ.డి.క్రీస్తుదాస్, హెడ్ మాస్టర్ కరుణాకర్ మరియు ఉపాధ్యానీ,ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు " శక్తీ యాప్ " అవేర్నెస్ ప్రోగ్రాము లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్, యాప్లైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ వాట్స్ అప్ లకు ఎవరైనా పంపితే వాటిని ఓ పెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జేరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.మీ , మీ ఇంటికి పోయిన తర్వాత మీ పేరెంట్స్ యొక్క ఆండ్రాయిడ్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను వాడాలి,దానీ ఉపయోగాల గురించి తెలుపుతూ మంచి క్రమశిక్షణ తో మెలుగుతూ చెడువలవాట్లకు లోనుకాకుండా ఉండి తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు ఎవరు కూడా మోటార్ సైకిళ్లను నడపవద్దని హెచ్చరిస్తూ మరియు ఆడపిల్లలను ఈవిటీజింగ్ పేరుతో అల్లరి పట్టించడం లాంటివి చేస్తే శిక్షలు పడి జైలుకు పోతారని హెచ్చరిక చేస్తూ, మీ జీవితాలను బాగుపర్చుకొంటూ మీరు చదువుకున్న స్కూల్ కు, మీ తల్లిదండ్రులకు గౌరవమర్యాదలు త్యావాలని,అవేర్నెస్ చేస్తూ అలాగే అవేర్నెస్ ప్రోగ్రాములో పాల్గొన్న అందరు వారి యొక్క ఆండ్రాయిడ్ మొబైల్స్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని, ఆపద సమయం లో ఎలా ఉపయోగించుకోవాలో తెలుపుతూ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ షేక్ నూర్ అహ్మద్ మరియు డబ్ల్యు హెచ్ జి. సుప్రియ అవేర్నెస్ కలిపిస్తూ ప్రోగ్రాము చేయడం జరిగింది. అదేవిధంగా మీ ఇంట్లోని మగవారు వారి మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేసే లాగా చెప్పమని చెప్తూ ఏదైనా అనుకోకుండా యాక్సిడెంట్లు జరిగితే తలకు దెబ్బలు తగలడం వల్లనే నూటికి 90 శాతం మంది చనిపోవడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు కచ్చితంగా తలకు హెల్మెట్ ధరించాలని, అదేవిధంగా మీ నాన్న, అన్నలు,మామలు ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడపవద్దని వారికి చెప్పమని చెప్తూ అట్లా తాగి వాహనాలు నడిపితే 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను కోర్టు వారు విధిస్తారు అని తెలుపుతూ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు.

# మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ సస్పెండ్...



జిల్లా అభివృద్ధి పై సమగ్రంగా సమీక్షించేందుకు బుధవారం జిల్లా సచివాలయం లోని పి జి ఆర్ ఎస్ సమావేశపు మందిరం నందు జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమం మరియు చేనేత జౌళి శాఖ మంత్రి శ్రీమతి ఎస్.సవిత గారి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో నిర్వహించగా... మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ పి. వెంకటలక్ష్మి అవక తవకలపై సమావేశంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రస్థావించగా సెక్రటరీ వెంకటలక్ష్మి నీ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.. బి .మఠం మండలం దీర్ఘవంచ గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, ఆర్ బి కే భవనాల నిర్మించకుండా బిల్లుల్లు చెల్లింపు వ్యవహారంలో... అక్రమాలపై విజిలెన్స్ విచారణకు కలెక్టర్ ,ఇంచార్జి మంత్రి ఆదేశించారు

# రూ.3.69 కోట్లతో ఆధునిక భవనాల నిర్మాణం ప్రారంభం..

## భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**వెలుగోడు, జూన్ 17 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని తెలుగుగంగ క్వార్టర్స్ ఆవరణలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వ అతిథి గృహం మరియు కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు బుధవారం శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు, అధికారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించిన పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అయ్యేలా నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలవనరుల శాఖ ఆధ్వర్యంలో తెలుగుగంగ పథకం పరిధిలో వెలుగోడులో చేపడుతున్న ఈ నిర్మాణ పనులకు మొత్తం రూ.3.69 కోట్లు (రూ.369 లక్షలు) నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఈ నిధులతో ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ అతిథి గృహం, కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయ భవనాలను నిర్మించనున్నారు.ఈ భవనాలు పూర్తయిన అనంతరం తెలుగుగంగ అధికారుల విధుల నిర్వహణ మరింత సులభతరం కావడంతో పాటు, వివిధ పనుల నిమిత్తం వచ్చే అధికారులు, ప్రజలకు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.ఈ కార్యక్రమంలో అన్నారపు శేషిరెడ్డి రెడ్డి టీడీపీ మండల అధ్యక్షులు అబ్దుల్ కలాం, పట్టణ అధ్యక్షులు మోమిన్ రసూల్, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, కాంట్రాక్టర్ పోచా వెంకట రెడ్డి (నంద్యాల), తెలుగుగంగ అధికారులు ఎస్.ఈ శివశంకర్ రెడ్డి, డి.ఈ.ఈ వెంకటేశ్వర్లు, డి.ఈ.ఈ నవజీవన్ రెడ్డి, ఏ.ఈ.ఈ ఉదయ్ కుమార్ రెడ్డి, ఏ.ఈ.ఈ శివ నాయక్, ఏ.ఈ.ఈ ఇలియాస్, తెలుగు గంగ సిబ్బంది అమీర్ హంజా, వీరభద్రుడు, బలుసా రాము, తాళ్లూరి నాగరాజు, బంకు శీను, సంజీవరాయ ప్రసాద్, డాక్టర్ బి. జాకీర్ హుస్సేన్, మండ్ల శంకర్ రెడ్డి, టైలర్ సయ్యద్, మద్దెల శంకర్ రెడ్డి జనసేన షాలుబాషా, బిజెపి పోతుల రాజశేఖర్ రెడ్డి, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జలదుర్గంలో 'రీ సర్వే' గ్రామసభ




**నందిపత్రిక –ప్యాపిలి** ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామంలో బుధవారం ఉదయం 11:00 గంటలకు భూముల "రీ సర్వే"పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీ కిషోర్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ సర్వే ఉపయోగపడుతుందని, రైతులు, భూ యజమానులు సర్వేయర్లకు సహకరించి తమ భూములకు సంబంధించిన సరైన సరిహద్దులను నిర్ణయించుకోవాలని ఆయన కోరారు.ఈ గ్రామసభలో ప్రముఖ గ్రామ నాయకులు ఆర్ ఈ నాగరాజు అన్న, తిరుపాల్ నాయుడు, కె సి మద్దిలేటి, రమణ గౌడ్ పాల్గొని, సర్వే సజావుగా సాగేందుకు గ్రామస్తులందరూ సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, రమణ గౌడ్ పాల్గొన్నారు

# మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఓట్లే గల్లంతయితే సామాన్యులకు దిక్కేది?

**బిఎల్ఓ ల వద్ద ఉండాల్సిన కలర్ జిరాక్స్ ఓటర్ల జాబితా టిడిపి బి ఎల్ ఎ ల వద్ద ఎలా ఉన్నాయి?**

**ఎస్ ఐ ఆర్ (సర్) పై వైఎస్ఆర్సిపి బిఎల్ఎ లు ప్రతిరోజు అప్రమత్తంగా ఉండాలి.**

**బి ఎల్ ఓ లు అక్రమంగా వైఎస్ఆర్సిపి ఓట్లు తొలగిస్తే కోర్టు ద్వారా చర్యలు తప్పవు.**

**'సర్' పై వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి నిశిత విమర్శ.**

**నంది ప్రతినిధి ఖాజీపేట జూన్ 17** కడప నియోజకవర్గం నుండి రెండుసార్లు శాసనసభ్యులుగా ఉండి, డిప్యూటీ సీఎంగా పని చేసి, దాదాపు 35 ఏళ్లకు పైబడి కడప నగరంలో ఓటర్ గా ఉన్న అంజాద్ భాష, మైదుకూరు నియోజకవర్గం నుండి నాలుగు సార్లు శాసనసభ్యులుగా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా పనిచేసి, తమ స్వగ్రామం నక్కల దిన్నెలో 60 సంవత్సరాలకు పైబడి ఓటరుగా ఉన్న శెట్టిపల్లి రఘురామిరెడ్డి ల ఓట్లే తొలగిస్తే... గల్లంతయితే వైఎస్ఆర్సిపి సామాన్య ఓటర్లకు దిక్కెక్కడని? వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి , కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి నిశితంగా విమర్శించారు. కడప నగరంలోని వైఎస్ఆర్సిపి జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ బి ఎల్ ఓ ల వద్ద ఉండాల్సిన కలర్ జిరాక్స్ ఓటర్ల జాబితా టిడిపి, కూటమి కి చెందిన బి ఎల్ ఎ వద్ద ఎలా ఉందని? ఆయన సూటిగా ప్రశ్నించారు. ఓటర్ల వ్యక్తిగత వివరాలను టిడిపి యాప్ లో నమోదు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. ఎస్ ఐ ఆర్ (సర్) ప్రక్రియలో భాగంగా టిడిపి, కూటమి పార్టీలకు చెందిన బి ఎల్ ఏ లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, ఆ సమాచారాన్ని 'మై టిడిపి పాస్పోర్ట్'యాప్ లో నమోదు చేస్తూ ఫారం -7ను అధికారులకు సమర్పించి వైఎస్ఆర్సిపి అతి ముఖ్య నేతలను, మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన వివరించారు. ప్రతి బిఎల్ఎ తమ పరిధిలో కనీసం 50 నుండి 100 ఓట్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీగా వ్యూహం పన్నుతోందని ఆయన పేర్కొన్నారు. టిడిపి, కూటమి బిఎల్ఎ ల అక్రమాలను అడ్డుకోవాల్సిన బిఎల్ఓ లు వారికి పూర్తిగా సహకరించడంతోనే వైయస్ఆర్సీపీ ఓట్లను ఎదేచ్ఛగా తొలగిస్తున్నారన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను 2002 ఓటర్ల జాబితా ఆధారంగా నిర్వహిస్తున్నప్పుడు ఆ ఓటర్ల జాబితాను ఆన్లైన్ లో ఉంచకపోవడం ఎన్నికల కమిషన్ కూటమినేతలకు సహకరించడమేనని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బిఎల్ఓ లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అలాకాకుండా టిడిపి, కూటమినేతలకు సహకరిస్తే బీఎల్ఓ లపై కోర్టుల ద్వారా చర్యలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. కూటమినేతలు తమ రెండేళ్ల పాలనకు సంబంధించి విజయోత్సవం ర్యాలీలో కూటమి ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసుకోకుండా వైయస్ జగన్ పై అసందర్భ ప్రేలాపనలు చేయడం వారి నీచ రాజకీయానికి పరాకాష్ట అని రెడ్యం ఎద్దేవా చేశారు.



# టిడిపి నేత సుబ్బ లక్ష్మయ్యకు సతీ వియోగం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 17:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కర్నాటి సుబ్బ లక్ష్మయ్య సతీ వియోగానికి గురయ్యారు. ఆయన భార్య సుబ్బసత్యనారాయణమ్మ (70) గత కొద్ది కాలం నుండి హెర్నియా వ్యాధితో బాధపడుతున్నారు. వారం రోజుల క్రితమే నంద్యాలలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ నిర్వహించిన నాటినుండి బాగానే ఉన్నప్పటికీ రెండు రోజుల క్రితం ఆమె గుండెపోటుకు గురైంది. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులతోపాటు, వైయస్సార్ పార్టీకి చెందిన నాయకులు సైతం సుబ్బ లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి సంతాపం ప్రకటించారు. భార్య చనిపోవడంతో సుబ్బలక్ష్మయ్య కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆప్తులు ఆత్మీయులు కుటుంబ సభ్యులు సుబ్బ లక్ష్మయ్య ను ఓదార్చారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి ఎంఈఓ ఓబులేసు



**పోరుమామిళ్ల,17: (నంది పత్రిక)**మండల పరిధిలోని రామేశ్వరం, నాగలకుంట్ల ఎంపీపీ పాఠశాలలను బుధవారం ఎంఈఓ ఓబులేసు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సంఖ్య, బోధన విధానాలను పరిశీలించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అలాగే పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యతో పాటు, ఆహ్లాదకరమైన తరగతి గదులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, యూనిఫాంలు, బ్యాగులు, బూట్లు, వివిధ ఆటవస్తువులు, గ్రంథాలయ పుస్తకాలు, 'తల్లికి వందనం' వంటి అనేక సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విద్యార్థులు బాగా చదివి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లోని కొన్ని వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. ప్రవీణ్ కుమార్, కల్లూరి విజయ భాస్కర్ రెడ్డి, విద్యార్థులు కలిసి ఎంఈఓ ఓబులేసును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ గుర్రయ్య, సీఎంఆర్టీలు రవి, రోజాలీన, రమణమ్మ, నాగలక్ష్మి, తిరుమలయ్య, సింగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ సంబరాలు కాదు ఉద్యోగాలుకల్పించండి

**ఏ ఐ వై యఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు**




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి అయిందని ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశామని కూటమి పాలకులు రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేస్తున్నారని అయితే వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందని విమర్శించారు విజయోత్సవ సంబరాలు కాదు ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారో చెప్పాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు ప్రశ్నించారు బుధవారం స్థానిక సిఆర్ భవన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కె శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి పాలకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు విజయవంతంగా అమలు చేశామని విజయోత్సవ సభలు పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన మండిపడ్డారు అవి విజయవత్సవ సభలు కాదని, రాష్ట్రంలో నిరుద్యోగులను వంచించిన సభలని ఆయన విమర్శించారు 2024 ఎన్నికలకు ముందు ప్రభుత్వ శాఖల్లో దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు అవుతా ఉన్న ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మినహాయించి ఏలాంటి ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు, అదేవిధంగా రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల కాలంలో ఎన్ని లక్షల ఉద్యోగాలు కల్పించారు ప్రజలకుతెలియజేయాలన్నారు, ఉద్యోగాలు కల్పించలేని పక్షంలో ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఇచ్చి రెండు సంవత్సరాల నుండి ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు, కూటమి పాలకులు విజయోత్సవ సభలు పెడుతూ పవన్ కళ్యాణ్ చంద్రబాబు ని, నారా లోకేష్ పవన్ కళ్యాణ్ ని, మిగతా మంత్రులు నారా లోకేష్ ని పొగడడం సరిపోతుంది తప్ప రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యల గురించి ఏ ఒక్కరు కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు, నిరుద్యోగ సమస్య నుండి యువతను తప్పుదోవ పట్టించేందుకు రంగురంగుల పత్రిక ప్రకటనలతో ప్రచారం నిర్వహిస్తూ యువకులను రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని అయితే కూటమి పాలకుల విధానాలను నిరుద్యోగులు ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని, ఓటమి నాయకులలు అసత్య ప్రకటనలతో ప్రజలను మోసం చేయలేరని కావున కూటమి పాలకులు అద్భుత కల్పన నుండి బయటకు వచ్చి నిరుద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో నిరుద్యోగుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాబీర్ భాషా, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, నగర నాయకులు అఖిల్, చంటి తదితరులు పాల్గొన్నారు.

# తుది మెరుగులు దిద్దిన తరువాతే బిల్లుల చెల్లింపు

**అభివృద్ధి పనుల్లో చివరి దశ పనులు పూర్తి చేయాల్సిందే**

**నగర స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**అపరిశుభ్రంగా ఉంచుకున్న ఇద్దరు షాపుదారులకు జరిమానాలు**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో రహదారులు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన తుది దశ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసి, నాణ్యత ప్రమాణాలను పాటించిన తరువాతే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా తుది మెరుగులు దిద్దడంతో పాటు, ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. బుధవారం ఆయన టైపిస్ట్ కాలనీ, చంద్రశేఖర్ నగర్ ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రహదారులను పరిశీలించారు. అలాగే జొహరపురంవెంకాయపల్లి బీటీ రహదారిలో చేపడుతున్న ప్యాచ్‌వర్క్ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రధాన నిర్మాణ దశ పూర్తయిన వెంటనే బిల్లుల ప్రక్రియ చేపట్టడం సరికాదన్నారు. సిమెంట్ రోడ్డులో మధ్యలోని జాయింట్లలో బిటుమినస్ జాయింట్ ఫిల్లర్ సీలెంట్ వేయడం, రోడ్డుడ్రైనేజీ మధ్యనున్న బెర్మ్ భాగంలో గ్రావెల్ వేయడం వంటి తుది దశ పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయిన తరువాతే బిల్లుల ఫైళ్లను తన వద్దకు తీసుకురావాలని సూచించారు.అంతకుముందు జొహరపురంవెంకాయపల్లి రహదారిలో, జొహరపురం డంప్‌యార్డ్‌లో బయో మైనింగ్ ద్వారా వెలువడిన జీర్ణమైన మట్టి, ఇన్నర్ట్ వ్యర్థాలతో చేపట్టిన రహదారి విస్తరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగ అధికారులను అభినందించారు.అనంతరం బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిల్, ముజఫర్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెన్నమ్మ సర్కిల్, ముజఫర్ నగర్ ప్రాంతాల్లో ఇద్దరు దుకాణదారులు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకుండా రహదారులపై చెత్తాచెదారంతో వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. నగర స్వచ్ఛతకు ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, కుర్మయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.




# భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానం యోగా.. అడిషనల్ డీఎంఈ కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** యోగాను వైద్యులు దినచర్యలో భాగంగా మార్చుకోండి. శివరాజు, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు ...కర్నూలు మెడికల్ కాలేజీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ముందస్తు వేడుకలు రాష్ట్ర ప్రభుత్వ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో ముందస్తు కార్యక్రమాల లో భాగంగా బుధవారం నాడు పతంజలి యోగ సమితి మరియు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ సహకారంతో యోగా శిక్షకులు శ్రీ శివరాజు ఆధ్వర్యంలో యోగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా యోగాను అభ్యసించాలని తద్వారా మానసిక ఒత్తిడికి దూరంగా ఉండవచ్చునని, రోజు యోగా చేయడం ద్వారా ఉత్సాహంగా కూడా ఉంటారని పేర్కొన్నారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. యోగా శిక్షకులు, భారత్ స్వాబిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు శివరాజు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ప్రతిరోజూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకుంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన సాధనమన్నారు. మెడికల్ కాలేజీ అధ్యాపకులకు విద్యార్థులచే యోగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాములు, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మంజుల భాయ్, డీఎస్పీ మెహబూబ్ బాష,పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షులు ఉపేంద్ర గౌడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.మనోహర్,డాక్టర్ సోమశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, లెక్చరర్ సురేష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ, వివిధ విభాగాల అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది, యూజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.



# కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి సాగు, త్రాగునీరు ఆర్డీఎస్ ద్వారా అందించేందుకు కర్ణాటక తెలంగాణ వారు అడ్డు చెప్పవద్దు--తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఇటీవల కృష్ణానది మేనేజ్మెంట్ బోర్డు వారు ఆర్డీఎస్ లెఫ్ట్ రైట్ కెనాల్సిన పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో కర్ణాటక తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఇరిగేషన్ అధికారులు హాజరు కావడం జరిగింది. కర్ణాటక కొనసాగిస్తున్నటువంటి జల దోపిడి పై తెలంగాణ ఇరిగేషన్ అధికారులు తమ వానిని వినిపించారు అంతేకాకుండ ఆర్డిఎస్ ద్వారా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి సాగు తాగునీరు అందించేందుకు గతంలో బచావత్ ట్రిబ్యునల్ సూచనల మేరకు నాలుగు టిఎంసిల మేరకు వాడుకునే వీలు కల్పించినందున ఈ ఆర్డీఎస్ ద్వారా నీటినీ కర్నూలు పశ్చిమ ప్రాంతానికి వాడుకోవడానికి అడ్డు చెప్పవద్దని విజ్ఞప్తి చేశారు ఎందుకంటే ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర ఎగువన ఎన్నో లిస్టుల ద్వారా దిగువ ప్రాంతానికి రావలసిన నీటిని అడ్డుకొని వాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ కనీసం ఆర్డీఎస్ ద్వారా కర్నూలు జిల్లా ప్రజలకు చేరవలసినటువంటి నాలుగు టీఎంసీల నీటిని సక్రమంగా ఉపయోగించుకునేందుకు ఇటు తెలంగాణ ప్రభుత్వం వారు కానీ కర్ణాటక వారు కానీ సహకరించాలని కోరారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఉన్నటువంటి నీటి సమస్యపై దృష్టి సారించి వేదవతి గుండ్రేవుల ఆర్డీఎస్ వంటి వాటిని పూర్తి చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారని కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి తీసుకున్న ఈ చర్యలకు అడ్డు చెప్పవద్దని తెలంగాణ కర్ణాటక ప్రభుత్వాలకు కర్నూలు జిల్లా ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను . శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఉపయోగించుకొనుచున్నటువంటి నీటిని వారికి అందజేయడం జరుగుతుంది కానీ ఇక్కడ అడ్డు చెప్పడం లేదని అందువల్ల తెలంగాణ ప్రభుత్వం వారు కూడా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

# కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీ మరియు డిపార్ట్మెంట్ వైస్ నోడల్ ఆఫీసర్స్ కు 'నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్'పై అవగాహన కార్యక్రమం మాట్లాడుతున్న ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిండెంట్ కె వెంకటేశ్వర్లు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని ధన్వంతరి హాల్ నందు పీజీ వైద్య విద్యార్థులకు 'నెక్స్ట్ జెన్ ఈ–హాస్పిటల్' విధానంపై బుధవారం ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, డిజిటల్ విధానం ద్వారా రోగుల వైద్య సేవలను మరింత వేగవంతం మరియు పారదర్శకంగా ఎలా మార్చవచ్చో విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా కె.వెంకటేశ్వర్లుమాట్లాడుతూ :మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఆసుపత్రిలోని కేస్ షీట్లు, ల్యాబ్ రిపోర్టులు, రోగుల వివరాల నమోదును డిజిటలైజ్ చేయడం ద్వారా వైద్య సేవల్లో జాప్యాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులు మరియు డిపార్ట్మెంట్ వైస్ నోడల్ ఆఫీసర్స్ ఈ సరికొత్త ఈ–హాస్పిటల్ విధానంపై పూర్తి అవగాహన పెంచుకుని, రోగులకు మెరుగైన డిజిటల్ వైద్య సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు ఏ ఆర్ ఎం ఓ లు డా సునీల్ ప్రశాంత్ , డా క్లింటన్, నెక్స్ట్ జెన్ ఈ హాస్పిటల్ నిక్ డిపార్ట్మెంట్ రోల్ ఔట్ మేనేజర్ జె. సురేష్ బాబు మరియు పెద్ద సంఖ్యలో పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉంటూనే బి ఎల్ ఏ లుగా విధులు: తహశీల్దార్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు




**నంది పత్రిక –ప్యాపిలి** ప్యాపిలి మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ, ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్న కొందరు వ్యక్తులు అదేవిధంగా స్టోర్ డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా ఒక రాజకీయ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమితులయ్యారని ప్యాపిలి మండల వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఇన్‌చార్జ్ మెట్టు విగ్నేశ్వర రెడ్డి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి కృష్ణారెడ్డి, బోరెడ్డి రాము పేర్కొన్నారు. బుధవారం పార్టీ నాయకులు కలిసి స్థానిక ఆర్ ఐ కు వినతిపత్రం సమర్పించారు.ఇటీవల ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం మొదలైన నేపథ్యంలో, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఈ అక్రమం వెలుగుచూసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ వేతనం తీసుకునే ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇలా ఒక పార్టీకి అనుకూలంగా బి ఎల్ ఏ లుగా వ్యవహరించడం చట్టవిరుద్ధమని వినతిపత్రంలో స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి రెండు పదవుల్లో కొనసాగుతున్న వారిని వెంటనే ఆయా బాధ్యతల నుండి తొలగించి, తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.వివాదంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు రామలింగారెడ్డి,పి.రాజేష్,మెట్టుపల్లి హరికృష్ణఏనుగుమర్రి రాంభూపాల్నల్లమేకల పల్లె నాగేశ్వరరావుచంద్రపల్లె వై. సందీప్ కుమార్వెంగళాంపల్లి జి. రమేష్ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్న సదరు వ్యక్తులపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి,రాచర్ల నబి రసూల్, మాధవరం నవీన్, బాయ్ పల్లె వెంకటేష్, వెంకటరామిరెడ్డి, రమణ, నాగరాజు, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

## ""“సర్“ పై సందేహాలు నివృత్తి చెస్తున్న తహసీల్దార్...... అనిల్ కుమార్ యాదవ్...

**మర్రిపాడు జూన్ 17నంది పత్రిక :** మర్రిపాడు మండల పరిధిలో జూన్ 15 నుంచి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్–సర్) పై ఓటర్లలోపెద్దఎత్తునసందేహాలువ్యక్తమవుతున్నాయి. రాజకీయ పార్టీల నుంచి కూడా పలు విజ్ఞప్తులు అందుతున్నాయి. ఓటర్లు వలసవెళ్లడం, మృతి చెందిన వారిపేర్లనుతొలగించకపోవడం, మరో చిరునామాకు మారడంవంటి వాటిపై సమగ్ర సర్వే జరిపి అనర్హులనుతొలగించి అర్హులను జాబితాలో చేర్చే ప్రక్రియనేఎస్ఐఆర్ అని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులుచెబుతున్నారు. ఈ క్రమంలో గ్రామ ఓటర్లు సందేహాలను నివృత్తి చెయడానికి మర్రిపాడు మండల మేజిస్టేట్ అనిల్ కుమార్ యాదవ్ పలు గ్రామాలు సందర్శించి గ్రామస్తులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చెస్తున్నారు.

**న్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం....** బీఎల్వోలు ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లుసందర్శిస్తారు. ఓటరుకు రెండు ఎన్యూమరేషన్‌పత్రాలను అందిస్తారు. ఆ పత్రాలను ఎలా నింపాలోవారు వివరిస్తారు. నింపిన రెండు పత్రాల్లో ఒకటి బీఎల్వోలు తీసుకుని, రెండో పత్రాన్ని రశీదుగాఅందిస్తారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ (ఫ్త్రజూం: ఒశీవతీం. వఆఱ. ఫ్రశీజ. అఅ లోకి వెళ్లి ఆన్లైన్లోనూ ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపొచ్చు.ఆన్లైన్ ఎన్యూమరేషన్ పత్రం ఎలా పూరించాలి?కేంద్ర ఎన్నికల సంఘం వెబ్సైట్లో ఆన్లైన్ఎన్యూమరేషన్ పత్రం అందుబాటులో ఉంటుంది.ఓటరు గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న మొబైల్‌నంబరు లేదా ఎపిక్ కార్డు నంబర్ను ఉపయోగించిపోర్టల్లోకి లాగిన్ కావాలి. కాగానే మొబైల్ కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేయడం ద్వారా టబశ్రీశ్రీ వఅబఎవతీఫ్ఱశీఅ టశీతీఎ అనే శీర్షిక కింద ఉన్న ఆప్షన్న ఎంచుకొని వివరాలు నమోదు చేయాలి. ఓటరు జాబితాలోని పేరు, వారి ఆధార్ కార్డులోని పేరుకుసరిపోలిన ఓటర్లకు మాత్రమే ఈ సౌకర్యంఉంటుంది. ఎల్ఓఇంటికిరాకపోయినా, ఎన్యూమరేషన్పత్రాన్ని అందించకపోయినా ఓటర్లు ఏం చేయాలి?బీఎల్వీ ఇంటికి వచ్చిన సమయంలో ఓటరులేకపోతే కుటుంబంలో మేజర్ అయిన సభ్యుడికిఎన్యూమరేషన్ పత్రాన్ని అందిస్తారు. ఆ సభ్యుడిద్వారా కూడా నింపిన పత్రాన్ని బీఎల్వీకుఅందించవచ్చు. ఒకవేళ ఓటరుకు నేరుగాఎన్యూమరేషన్ పత్రం అందకపోతే వెబ్సైట్లో బీఎల్వీనంబరు ఉంటుంది. ఫోన్ చేసి సంప్రదించవచ్చు.కేంద్ర ఎన్నికల సంఘం వెబ్సైట్, ఈసీఐనెట్‌యాప్(బుక్ ఏ కాల్ విత్ బీఎల్వీ) ద్వారానూసంప్రదించవచ్చు.న్యూమరేషన్ పత్రాన్ని పూరించడంలో ఇబ్బందులు ఎదురైతే ఏం చేయాలి?బీఎల్ఓ మొదటి సారి పత్రాన్ని అందించినప్పుడఎలా పూరించాలో వివరిస్తారు. అయినా సందేహాలు ఉంటే రెండోసారి ఇంటిని సందర్శించినప్పుడు సహాయం చేస్తారు. ఎన్యూమరేషన్ పత్రంలోసవరణలకు కొత్త ఫారాన్ని పొందాలన్న నిబంధనలేదు. ఏవైనా మార్పులు ఉంటే తప్పుగా రాసిన పత్రంలోనే సవరించి స్పష్టంగా మరోసారి వివరాలు పూరించవచ్చు.ఎస్ఐఆర్–2002 ఓటర్ల జాబితాలో పేరు ఉందోలేదో ఎలా తెలుసుకోవాలి?కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించినపోర్టల్లోకి వెళ్లి సెర్చ్ బై ఎలక్టర్స్ డీటెయిల్స్‘ ఆప్షన్లో వివరాలను తెలుసుకోవచ్చు. పార్ట్ వారీగా ఓటర్ల జాబితాసమాచారం పీడీఎఫ్ రూపంలోనూ అందుబాటులోఉంటుంది. బీఎల్వీల వద్ద కూడా ఆ పోలింగ్ బూత్కు సంబంధించిన జాబితా ఉంటుంది.2025పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసిన వ్యక్తి పేరు ఉంటుంది.ఎస్ఐఆర్ 2002 ఓటర్ల జాబితాలో లేకుంటే ఏంచేయాలి?ఎస్ఐఆర్ 2002 జాబితాలో పేరు లేకపోతే ఆసమయంలో ఓటరుగా నమోదు చేసుకోలేదని అర్థం.ఇలాంటి సందర్భాల్లో వారి తల్లిదండ్రులు/నాయనమ్మ, తాతయ్యల ఓటు వివరాలను సేకరించి ఎన్యూమరేషన్ పత్రంలోని సంబంధిత కాలమ్ లో పూరించవచ్చు. ఇందుకోసం బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలి.ఓటరు ఎవరైనా ఎన్యూమరేషన్ పత్రం తీసుకునితిరిగి ఇవ్వకపోతే గైర్హాజరు/మృతి చెందడం/వేరేప్రాంతానికి వెళ్లిపోవడం/రెండు చోట్ల ఓటు ఉండడంతదితర వివరాలపై బీఎల్వీలు ఆరా తీస్తారు. వీరిపేర్లు ముసాయిదా జాబితాలో ప్రచురించరు.కుటుంబంలోని ఓ ఓటరు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తుంటే.. ఆ వ్యక్తి ఎన్యూమరేషన్ పత్రాన్ని ఎలానింపాలి? కుటుంబంలోని ఒక ఓటరు విదేశాలలో లేదా ఇతరప్రాంతాల్లో పని చేస్తుంటే ఆ వ్యక్తి ఎన్యూమరేషన్ పత్రాన్ని ఆ కుటుంబ పెద్దకు అందిస్తారు. ఓటరుతరపున ఆ ఇంటి పెద్ద ఎన్యూమరేషన్ పత్రాన్నినింపి సంతకం చేసి బీఎల్వోకు అందించాలని తహసీల్దార్ గ్రామస్తులు సందేహాలను పై విదంగా నివృత్తి చేస్తూ అవగాహనా కల్పిస్తున్నారు.ఓటరు ఎప్పుడు గుర్తింపు కార్డులను సమర్పించాలి?ఏ కార్డులను ఎస్ఐఆర్ గుర్తిస్తారు?ఎన్యూమరేషన్ పత్రం నింపి బీఎల్వోలకు ఇచ్చేసమయంలో ఎలాంటి గుర్తింపు కార్డులనూఅందించాల్సిన అవసరంలేదు. ఓటర్లముసాయిదాజాబితా ప్రచురితమైన తర్వాత లింక్ చేయని లేదాగత సవరణ ఓటర్ల జాబితాలో లింక్ చేయడంలోవ్యత్యాసం ఉన్న వ్యక్తులకు ఈఆర్వో నోటీసులు జారీచేస్తారు. నోటీసు అందిన తర్వాత సంబంధిత ఓటరుతనఅర్హతనునిరూపించుకోవడానికి కేంద్రఎన్నికల సంఘం ప్రకటించిన ఈ పత్రాల్లో ఒకటి సమర్పించాలి.1) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్ యూ ఉద్యోగులు లేదా పెన్షనర్లకు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు(పీపీవో)2) 01-07-1987 మందు ప్రభుత్వ సంస్థలు/బ్యాంకులు/పోస్టు ఆఫీసులు/ఎస్ఐసీ/ స్థానికసంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలు.3) ప్రభుత్వం నిర్దేశించిన అధికారితో జారీ చేసిన

జనన ధ్రువీకరణ పత్రం4) పాస్పోర్టు5) గుర్తింపు పొందిన బోర్డులు / విశ్వవిద్యాలయాలు

జారీ చేసిన మెట్రిక్యులేషన్ లేదా ఇతర విద్యార్హతపత్రాలు.6) సంబంధిత అధికారి జారీ చేసిన శాశ్వత నివాసధ్రువీకరణ పత్రం7) అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం.8) కుల ధ్రువీకరణ పత్రం

9) జాతీయ పౌర పట్టిక(ఎన్ఆర్సి) (ఎక్కడైనాఅమలులో ఉంటే)

10) రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలచే జారీ చేసిన కుటుంబ రిజిస్టర్ పత్రం

11) ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా భూమి/ఇంటి పన్ను.



## రాష్ట్ర అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 17 నంది పత్రిక**రెండేళ్ల అభివృద్ధి – సంక్షేమ పాలనపై నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రత్యేక సభ నిర్వహించినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత కల్పించిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాష్ట్ర అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల పురోగతి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రతి శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం గ్రామాల స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం పెన్షన్లు పంపిణీలో ప్రజల ఇళ్లకు వెళ్లడం వంటికి చర్యల ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామని ప్రజల సంక్షేమమే రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు.

## .ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి: ఆర్ పి ఎస్ ఎఫ్, ఆర్ఎస్ఎఫ్.



**నందికొట్కూరు జూన్ 17( నంది పత్రిక)** నందికొట్కూరు పట్టణంలో నెలకొన్న ప్రవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడికి పాల్పడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వివరించే ప్రైవేట్ పాఠశాల విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్ పి ఎస్ ఎఫ్, ఆర్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్ నాయుడు, వేటూరి రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోనే ఫీజులతో దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి రామిరెడ్డికి ఆర్ పి ఎస్ ఎఫ్, ఆర్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్ నాయుడు, వేటూరి రంగస్వామి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారుమాట్లాడుతూ ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ శ్రీ చైతన్యవంటి విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎల్కేజ్ నుండి పదవ తరగతి వరకు లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేయడమే కాకుండా, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు భారాన్ని మోపుతున్నారన్నారు .ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగాఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకపోవడమే కారణమని విమర్శించారు. అదేవిధంగా స్కూల్ డే, అన్యువల్ డే వంటి కార్యక్రమాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బే ధ్యేయంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు . ప్రభుత్వం అమలు చేసిన విద్య హక్కు చట్టాన్ని ఈ విద్యాసంస్థలు ఏమాత్రం పట్టించుకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూల్ లపై, గుర్తింపు లేని కార్పొరేట్ పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

## మొహర్రం వేడుకకు సిద్ధం పీర్లను కూర్చోబెట్టే కార్యక్రమం లో పాల్గొన్న మంత్రి బీసి



**బనగానపల్లె జూన్ 17నందిపత్రిక** బనగానపల్లె ఆస్థానంలోబుధవారం నిర్వహించిన హజ్రత్ అబ్బాస్ అలీ పీర్లు కూర్చోబెట్టే కార్యక్రమంలో మంత్రి బీసి జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు మొహరం శాంతి, సౌభ్రాతృత్వాలకు ప్రతీకగా వైభవంగా జరగాలని ఆకాంక్షించారు.. అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో వేడుకలు జరుపుకొని, రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన చేశారు.

## కల్లూరులో ముమ్మరంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ

### ఇంటింటికీ తిరిగి వెరిఫికేషన్ చేసిన బీఎల్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు



**నంది పత్రిక కర్నూలు బ్యూరో** కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ – ూ×=) కార్యక్రమం బుధవారం కల్లూరు అర్బన్ పరిధిలో ముమ్మరంగా సాగింది. కల్లూరు అర్బన్–2 పరిధిలోని 47వ సచివాలయ పరిధిలో గల 194వ పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక బూత్ లెవెల్ అధికారులు (దీూా), సచివాలయ సిబ్బందితో కలిసి కూటమి (బీజేపీ, టీడీపీ, జనసేన) నాయకులు, వైస్సార్సీపీ నాయకులు సంయుక్తంగా పాల్గొన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ (దీూాూ–2) గా పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్–2 బీజేపీ ప్రధాన కార్యదర్శి ఉలిందా కొండ రవి నేతృత్వంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటికీ తిరిగారు. ఓటర్ల వివరాల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన కొత్త ఓటర్ల చేరిక తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఉలిందా కొండ రవి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. బూత్ స్థాయిలో ఎలాంటి తప్పులు లేని పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని పార్టీల నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధి బర్త్ డే సందర్భంగా రక్తదాన శిబిరము



**కర్నూల్ సిటీ నంది పత్రిక** జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కళా వెంకట్రావ్ భవనం కర్నూలు నందు 19:06:26 వ తేది శుక్రవారం ఉదయం 10:00 గంటలకు జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు పార్లమెంట్ లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరుగును. ఈ కార్య క్రమమునకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ అధ్యక్షత వహించెదరు. ముందుగా పార్టీ కార్యాలయం నందు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ కార్యక్రమం జరుగును. అనంతరం కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేయుదురు. కనుక ఈ కార్యక్రమమునకు కాంగ్రెస్ నాయకులు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు, సిటీ కాంగ్రెస్, పార్టీ అనుబంధ సంస్థలయిన జిల్లా మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, సేవాదళ్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సెల్, కిసాన్ సెల్, ఐ ఎన్ టి యు సి, డాక్టర్ సెల్, లేబర్ సెల్, సాంస్కృతిక విభాగాలు కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేయోభిలాషులు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన వలసినదిగా కోరడ మైనది.

## పడకండ్ల అభివృద్ధికి శ్రీకారం

### రూ.75 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజ్ పనులకుభూమిపూజ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 17, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని పడకండ్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శ్రీకారం చుట్టారు. బుధవారం గ్రామంలోని కాసిరెడ్డి నాయన టెంపుల్ నుండి సిఎస్ఐ చర్చి వరకు రూ.75 లక్షల వ్యయంతో 900 మీటర్ల సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ పడకండ్ల గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈ పనులు చేపటామన్నారు. మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య వసతులు కల్పించడం ద్వారా గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ మున్సిపల్ ఏఈలు సద్దాం శివకుమార్ రెడ్డి ,శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి, పడకండ్ల టీడీపీ నాయకులు బద్రి సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ హుస్సేన్ భాష, నరసింహులు , నాగాంజనేయులు ,పాంపల్లె మద్దిలేటి, సచివాలయ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు, అబిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చివేత

### ఆర్ అండ్ బి శాఖ మంత్రి ఆదేశాల మేరకు కూల్చివేసిన త్రాగునీటి శాఖ అధికారులు అధికారులు

**బనగానపల్లిజూన్ 17నందిపత్రిక** పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంతంలోని జర్నలిస్ట్ కాలనీలో తాగునీటి అవసరాల కోసం ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండటంతో సంబంధిత ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ అధికారులు బుధవారం ట్యాంకును కూల్చివేశారు. రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మధ్యాహ్నం ట్యాంక్ పిల్లర్లకు బ్లాస్టింగ్ సామగ్రి అమర్చి కూల్చి వేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారి మాట్లాడుతూ సుమారు 50 ఏళ్ల క్రితం 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఒహెచ్ ఆర్ ట్యాంకు గత 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉండి కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. అకస్మాత్తుగా కూలి పరిసరప్రాంతాల్లోని జనావాసానికి భారీ నష్టం వాటిల్లుతుందని వివిధ ప్రసార మాధ్యమాల్లో వచ్చిన నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు బ్లాస్టింగ్ సామాగ్రితో కూల్చి వేశామని తెలిపారు.అవసరాన్ని బట్టి అక్కడ మరో నూతన ఓ హెచ్ ఆర్ ట్యాంక్ నిర్మాణం చేపడతామని గ్రామీణ త్రాగునీటి శాఖ అధికారులు తెలిపారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# జూన్ 19న భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి థీమ్-బేస్డ్ యోగా డెమోన్స్ట్రేషన్ కార్యక్రమం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 17 నంది పత్రిక** అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర2026" కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి థీమ్ ఆధారిత యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని ఈ నెల 19వ తేదీన భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, యోగాను ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం మరియు శారీరక-మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర2026" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు, యోగా శిక్షణ శిబిరాలు, ప్రదర్శనలు, సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించబడిందని ఆమె వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి థీమ్-బేస్డ్ యోగా డెమోన్స్ట్రేషన్ కార్యక్రమం జూన్ 19వ తేదీ ఉదయం 6.30 గంటల నుండి 8.00 గంటల వరకు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు, యోగా శిక్షకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు మరియు క్రీడా శాఖ అధికారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని, ముఖ్యంగా క్రీడాకారుల ప్రతిభాభివృద్ధికి మరియు పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో యోగా ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని, భారతదేశం ప్రపంచానికి అందించిన ఈ అమూల్యమైన సంపదను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక సమర్థవంతమైన సాధనమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పాల్గొనే వారికి తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ మరియు ఇతర



మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. జిల్లాలోని క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యోగా సాధకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఆమె కోరారు.

# ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రశీగా ఉంచుకోవాలి

### ఉమ్మడి కర్నూలు జిల్లా

### ముఖ్య కార్య నిర్వహణ అధికారి రమణారెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 17 నంది పత్రిక** ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ముఖ్య కార్య నిర్వహణ అధికారి రమణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లా కర్నూలు ముఖ్య కార్య నిర్వహణ అధికారి రమణారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం మండలంలోని నల్లగట్ల, చింతకొమ్మదిన్నె గ్రామాల లో జరుగుతున్న స్వచ్ఛ పదం కార్యక్రమానికి హాజరై తనిఖీ చేశారు. ఎంపీడీవో నూర్జహాన్ తదితరులు ఉన్నారు.

# శ్రీ మద్దులేటి స్వామి హుండీ లెక్కింపు 45 లక్షల 73 వేల 676 రూపాయలు నగదు.

### 66 గ్రాముల బంగారు- 7 వందల గ్రాములు వెండి లభ్యం.





**బేతంచెర్ల జూన్ 17 ( నంది పత్రిక).** బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో వెలసిన శ్రీ మద్దు లెటీ నరసింహ స్వామి, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవార్లను సుదూర ప్రాంతాలనుండి వేల సంఖ్యలో భక్తులు కదలి వచ్చి వారి వారి మొక్కుబడులు చెల్లించుకుంటూ శ్రీ స్వామి వారి దేవాలయంలో గల హుండీలో కానుకలు ముడుపులు సమర్పించుకొనుట ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. అందులో భాగంగా 14/5/2026 నుండి 16/6/2026 వరకు 34 రోజుల వరకు హుండీ లెక్కింపు బుధవారం నిర్వహింప బడినది. 45 లక్షల 73 వేల 676 రూపాయలు నగదు రూపంలో, 66 గ్రాముల బంగారు, 7 వందల గ్రాములు వెండి సమకూరిందని ఉప కమిషనర్ & దేవ స్థానం కార్య నిర్వహణ అధికారి ఎం రామాంజనేయులు తెలిపారు. ఈహుండీ లెక్కింపు కార్యక్రమం లో బేతంచెర్ల పట్టణానికి చెందిన బాలాజీ సేవా సమితి సభ్యులు,డోన్ పట్టణానికి చెందిన శ్రీ మద్దులేటి స్వామి సేవా సమితి సభ్యులు, వాసవీసేవా సమితి సభ్యులు మరియు అమ్మవారిశాల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో రూ.200.40 కోట్ల రుణాల పంపిణీ.

### 13,899 స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఎఫ్ఐఎస్ రుణాల అందజేత.



**ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం బ్యూరో చీఫ్ జూన్, 17 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ "వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్" లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలోని 13,899 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.200.40 కోట్ల రుణాలను పంపిణీ చేశారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం , ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ , ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) , మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లిలో ఎన్టీఆర్ జిల్లా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సభలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఎఫ్ఐఎస్ రుణాల మంజూరును ప్రతిష్టాత్మకంగా భారీ చెక్కు రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్" కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో కనీసం ఒకరిని స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ రుణాల ద్వారా చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు, సేవా రంగ కార్యకలాపాలను ప్రారంభించి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, బ్యాంకర్లతో పాటు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు చర్యలు కొనసాగుతాయని వారు తెలిపారు.

# ఈ నెల 16 నుండి జూలై 31 వరకు జిల్లాలో "స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026" సమర్థవంతంగా నిర్వహించాలి.

### గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...



**ఏలూరు బ్యూరో చీఫ్, జూన్ 17 నంది పత్రిక:** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం "ఈ నెల 16 నుండి జూలై 31 వరకు జిల్లాలో "స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026" పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షత సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులకు క్యాంపెయిన్ లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వర్షా కాలంలో డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టేందుకు జిల్లాలో ఈనెల 16 తేదీ నుండి జూలై 31 వ తేదీ 2026 వరకు "స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2026" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన క్యాంపెయిన్ గోడపత్రికలను విడుదల చేశామని, గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చెయ్యాలని అన్నారు. వర్షాకాలంలో సాధారణంగా డయేరియా, నీటిద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు నివారణ చర్యలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా కాపాడటం, డయేరియా వల్ల సంభవించే మరణాలను పూర్తిగా నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, జింక్ మాత్రలు వినియోగం పై అవగాహన కల్పించాలని అన్నారు. సురక్షిత తాగునీటి వినియోగం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఆహార పరిశుభ్రత వంటి అంశాలుపై విస్తృత ప్రచారం చెయ్యాలని అన్నారు. గ్రామ,వార్డు స్థాయిలో ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి డయేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వైద్య అధికారులు క్యాంపెయిన్ వివరాలు ఎప్పటికప్పుడు వివరాలను తెలియ చేస్తూ, డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని వెంటనే వినియోగించాలని ప్రజలకు సూచించాలని తెలిపారు.జిల్లాలో ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేలా అన్ని శాఖలు సమిష్టిగా కృషిచెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, డిప్యూటీ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యస్. పద్మావతి, డీసీహెచ్ఎస్ డా.సి.హెచ్. బేబి కమల, జిల్లా ప్రజా రవాణాధికారి యస్.కె.షబ్నమ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సి.హెచ్. సూర్యచక్రవేణి, జిల్లా సంబంధిత వివిధ శాఖలు అధికారులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.



# ఆక్వా రంగం జిల్లాలో ముఖ్యమైన జీవనాధార రంగం

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి




**పాలకొల్లు బ్యూరో చీఫ్ జూన్ 17 నంది పత్రిక** ఆక్వా రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించి, ఉత్తమ సాగు పద్ధతులు పాటించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు ఎగుమతి ప్రమాణాలను సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం పాలకొల్లు ఎస్ ఎస్ కళ్యాణ మండపంలో ఆక్వా రైతుల కోసం ఫార్మ్ రిజిస్ట్రేషన్, ఫార్మ్ ఎన్‌రోల్మెంట్, విత్తనాల నాణ్యత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఆక్వా రంగం జిల్లాలో ముఖ్యమైన జీవనాధార రంగమని, రైతులు తమ చెరువులను తప్పనిసరిగా నమోదు చేసుకొని ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఫార్మ్ రిజిస్ట్రేషన్ మరియు ఎన్‌రోల్మెంట్ ద్వారా ట్రేసబిలిటీ, నాణ్యత ప్రమాణాల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. నాణ్యమైన హ్యాచరీల నుంచి మాత్రమే విత్తనాలు సేకరించి సాగు చేపట్టడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ గోపాల్ ఆనంద్ ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ కన్సల్టెంట్ ఖగ్గేశ్వరరావు ఫార్మ్ రిజిస్ట్రేషన్ విధానం, నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించారు. నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ ప్రతినిధి ఎస్.బాలాజీ సుస్థిర ఆక్వాకల్చర్ పద్ధతులు, రైతులు పాటించాల్సిన ఉత్తమ యాజమాన్య విధానాల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఓఎస్డీ ప్రొఫెసర్ టి.సుగుణ నాణ్యమైన విత్తనాల ఎంపిక, చెరువుల నిర్వహణ, వ్యాధి నివారణ చర్యలపై సాంకేతిక సూచనలు అందించారు.జిల్లా మత్స్యశాఖ అధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న సేవలు, నమోదు ప్రక్రియల గురించి వివరించారు. ఆక్వా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆక్వా రైతులు, మత్స్య శాఖ అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. రైతులు అడిగిన సందేహాలకు నిపుణులు సమాధానాలు అందించారు.



# ఓటరు జాబితా సవరణను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి..

### ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా పారదర్శకంగా సవరణలు చేపట్టాలని అధికారులకు ఆదేశం..



**ఏలూరు బ్యూరో చీఫ్,జూన్ 17: నంది పత్రిక** ఏలూరు మండలం చోదిమెళ్ల గ్రామంలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ,కొత్త ఓటర్ల నమోదు, మరణించిన మరియు ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల తొలగింపు వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న పనితీరును సమీక్షించి, ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి పారదర్శకతతో సవరణలు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, ప్రజల నుండి వచ్చే అభ్యర్థనలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత కీలకమని,ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లాపరిషత్ సీఈవో పి. జగదాంబ, నగర పాలక సంస్థ కమిషనర్ ఏ. భానుప్రతాప్, తహసీల్దార్ కె. గాయాత్రిదేవి తదితరులు ఉన్నారు.

# అర్హులైన 17 మందికి ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం

నెహ్రూ నగర్ అధ్యక్షుడు సయ్యద్ సుల్తాన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కలిసి కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. 17 మంది అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పెన్షన్‌ను తక్షణమే ధృవీకరించి మంజూరు చేయాలని వారు కోరారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, సంబంధిత దరఖాస్తుదారులు 2023 సంవత్సరంలో ప్రజాపాలన 6 గ్యారంటీల పథకం ద్వారా ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు వారి దరఖాస్తులు వ్యవస్థలో నమోదు కాకపోవడంతో పాటు ధృవీకరణ ప్రక్రియ కూడా పూర్తికాలేదని తెలిపారు. దీంతో వారికి ఇప్పటివరకు ఎలాంటి పెన్షన్ ప్రయోజనం అందలేదని వివరించారు. దరఖాస్తుదారులందరూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారని, ఆసరా పెన్షన్‌కు పూర్తిగా అర్హులైన నిజమైన లబ్ధిదారులని పేర్కొన్నారు. ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నందున, వారి దరఖాస్తులను వెంటనే నమోదు చేసి ధృవీకరించి, ఎటువంటి జాప్యం లేకుండా ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రజాక్, గౌస్, అజీమ్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా జరగాలి

**చోదిమెళ్ల రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏపీఏఐయంఎస్ 2.0 ద్వారా ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఏలూరు, బ్యూరో చీఫ్ జూన్ 17: నంది పత్రిక** జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బుధవారం ఏలూరు మండలం చోదిమెళ్ల గ్రామ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీఏఐయంఎస్ 2.0 వెబ్‌సైట్ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఈ-క్రాప్ నమోదు వివరాలు, ఆధార్ అనుసంధానం, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైతు ఆధార్ నంబర్ నమోదు చేసిన అనంతరం ఓటీపీ ధృవీకరణతో పంట విస్తీర్ణం, పంట వివరాల ఆధారంగా యూరియా, డీఏపీ ఎరువులు దఫాల వారీగా కేటాయించబడుతున్నాయని అధికారులు వివరించారు. ఏపీఏఐయంఎస్2.0 ద్వారా రైతులు తమకు కేటాయించిన ఎరువులను సులభంగా పొందే అవకాశం ఉందని, మొబైల్ నంబర్ నవీకరణ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఈ వ్యవస్థను వినియోగించుకుని ఎరువులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరం ఈ క్రాప్ నందు నమోదు చేసిన రైతుల వివరాలు ఏపీఎయంఎస్ 2.0 వెబ్సైట్ లో సదరు రైతు సేవా కేంద్రంలో గల వ్యవసాయ అసిస్టెంట్ తనిఖీ చేశారా లేదా రైతుల కొనుగోలు చేయు దుకాణాలను వెబ్సైటు లో అనుసంధానం చేసారా లేదా అని తనిఖీ చేసి చోదిమెళ్ల గ్రామ రైతుల ఎరువుల అవసరాలకు అనుసంధానమైన శనివారపుపేట సొసైటీ వారు లాగిన్ లో రైతుల ఆధార్ నెంబర్ ని ఎంటర్ చేయగా వారి పంట నమోదు వివరాలను కనుగొనగా పంటను బట్టి యూరియా, డి ఎపి బస్తాలు ఆన్లైన్ లో రైతులకు ఇచ్చే ప్రకీయను కలెక్టర్ పరిశీలించారు.రైతు ఆధార్ నెంబర్ ఎంటర్ చేయగా రైతుకు ఓటిపి వచ్చి రైతు సాగు చేయు భూమి విస్తీర్ణం, పంటను బట్టి యూరియా, డి ఎపి బస్తాలు మూడు దఫాలుగా కేటాయించడం జరుగుతుందన్నారు.“దఫాల వారీగా రైతులకు కేటాయించిన బస్తాలను కొనుగోలు చేసుకోవచ్చును. రైతులు మొబైల్ నెంబరు సొసైటీ వారి లాగిన్‌లో అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించడం అయింది. ఈ నూతనంగా ప్రవేశపెట్టిన యాప్ ద్వారా రైతులు పంట భూమి విస్తీర్ణాన్ని బట్టి వారికి కేటాయించిన యూరియా మరియు డీఏపీ బస్తాలు అందుబాటులో ఉండునని, ఈ యాప్ ద్వారా కొనుగోలు చేయవలసిందిగా రైతులకు తెలియజేశారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతున్నాయా అనే అంశంపై ఆరా తీశారు. ఎరువుల నిల్వలు, పంపిణీ రికార్డులు, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించిన కలెక్టర్, రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు పారదర్శకంగా పంపిణీ నిర్వహించాలని సూచించారు.




వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువుల నిల్వలు తగినంతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ ఎరువుల కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో కలెక్టర్ వారి వెంట జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హాబీబ్ బాషా,జిల్లా పరిషత్తు సీఇవో పి. జగదాంబ, తహసీల్దారు కె. గాయత్రీదేవి, ఏడీఏ అనిల్ కుమారి, మండల వ్యవసాయ అధికారి జీవన సంధ్య, టెక్నికల్ ఏవో వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు కోనేరు వంశీకృష్ణ, సొసైటీ సిబ్బంది, రైతు సేవ కేంద్రం సిబ్బంది, విస్తరణ అధికారులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు..

# త్వరలో జర్నలిస్టులకు తీపి కబురు

## మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



త్వరలోనే జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున తీపి కబురు అందుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డిని టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా జర్నలిస్టులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై చర్చించడం జరిగింది. ప్రధానంగా అక్రిడేషన్ కార్డులు, ఇంటి స్థలాల విషయమై చర్చించగా వారు స్పందించి ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంలో సిద్ధంగా ఉన్నారని త్వరలోనే జర్నలిస్టులకు తీపి కబురు అందుకోబోతున్నారని చెప్పారు. అంతకుముందు జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అమరుడు తక్కల్లపల్లి రాజేందర్ జీవిత సహచరిని రమాదేవికి ప్రభుత్వం తరపున లక్ష రూపాయల చెక్కును అందజేయడంతో పాటు, రమాదేవికి ప్రతి నెల పెన్షన్ రూ. 3000, వారి కూతురు కుమారుడికి ప్రతి నెల రూ. 2000 చొప్పున చదువుల నిమిత్తం ట్యూషన్ ఫీజు ప్రభుత్వం అందించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్ మాదిగ, కొండగడుపుల ఎల్లయ్య పాల్గొన్నారు. ప్రభుత్వం నుండి సహకారం అందించే విషయంలో కృషి చేసిన యూనియన్ జర్నలిస్టు నాయకులకు రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

# వెన్నుపోటుకు పేటెంట్ హక్కుదారుడు జగన్

**- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు నీతులు చెబుతున్నాడు**

**- అబద్ధాలతో అధికారం... అరాచకాలతో గత ఐదేళ్లు పాలన**

**- తల్లి, చెల్లిని రాజకీయంగా వాడుకుని పక్కన పెట్టింది ఎవరు?**

**- రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టిన జగన్‌కు ప్రజలే గుణపాఠం చెప్పారు**

**- అప్పులు, అరాచకాలు, అబద్ధాల పాలనకు 2024లో ముగింపు పలికారు**

**- కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం వైసీపీ నైజం**

**- 2014లో రాష్ట్రాన్ని నిర్మించాం... 2019లో రాష్ట్రాన్ని నాశనం చేశారు**

**- గొడ్డలి రాజకీయాలు కాదు... అభివృద్ధి రాజకీయాలే కూటమి ప్రభుత్వ అజెండా**

**- రెండేళ్లలోనే రాష్ట్రానికి కొత్త దిశ చూపిన చంద్రబాబు ప్రభుత్వం**

**- కులాలు, మతాల పేరుతో జగన్ చిచ్చు పెట్టే కుట్రలను తిప్పికొడతాం - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, బ్యూరో చీఫ్ జూన్ 17 నంది పత్రిక** రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. వెన్నుపోటుకు కర్త, కర్మ, క్రియ జగన్‌నేనని, ఆ పదానికి పేటెంట్ హక్కులు ఎవరైనా ఇవ్వాలంటే అది జగన్‌కే ఇవ్వాలని ఎద్దేవా చేశారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆంధ్రప్రదేశ్ తీవ్ర సంక్షోభంలో పడింది. రాజధాని లేదు, ఆదాయం లేదు, పరిశ్రమలు లేవు, ఉద్యోగ అవకాశాలు లేవు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థ నాయకుడు కావాలని ప్రజలు భావించి తెలుగుదేశం పార్టీకి అవకాశం ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఐదేళ్లలో ప్రజలు ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు కృషి చేశాం. అయితే 2019లో అబద్ధాలు, అసత్యాలు, సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి జగన్ అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దమనకాండ సాగించారని తెలిపారు.రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి లక్షల కోట్ల అప్పులు చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా దివాళా అంచుకు చేర్చారు ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, మార్కెట్లు, వివిధ ఆదాయ వనరులను తాకట్టు పెట్టి భారీ స్థాయిలో అప్పులు తెచ్చింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టింది. మద్యం ఆదాయాన్ని కూడా భవిష్యత్ తరాలకు భారం అయ్యేలా ఉపయోగించారు. అభివృద్ధి లేకుండా, ఆదాయ సృష్టి లేకుండా అప్పులపై ఆధారపడిన పాలన సాగింది. వైసీపీ అరాచక పాలనను చూసిన ప్రజలు మళ్లీ చంద్రబాబు నాయుడు నాయకత్వాన్నే కోరుకున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ మరోసారి అబద్ధాలు, ఆరోపణలు, విద్వేష రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఈ రోజు “వెన్నుపోటు“ పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ కుటుంబం అండతో ఆయన కుటుంబానికి రాజకీయ గుర్తింపు వచ్చింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుని రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి లక్ష కోట్ల అక్రమాస్తులు సంపాదించి, జైలుకు వెళ్లిన వ్యక్తి జగన్. తండ్రి మరణించిన సమయంలోనే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాల సేకరణ జరిపించడం రాజకీయ చరిత్రలో ఎప్పటికీ మచ్చగా మిగిలిపోతుంది. పదవి రాలేదని కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీ పెట్టడం వెన్నుపోటు కాదా? జైలులో ఉన్న సమయంలో తల్లి, చెల్లెలు పార్టీ కోసం కష్టపడితే, అధికారంలోకి వచ్చిన తర్వాత వారినే దూరం పెట్టడం వెన్నుపోటు కాదా? ఈ ప్రశ్నలకు ముందు సమాధానం చెప్పాలి. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్ ఈ రోజు యువత గురించి మాట్లాడటం హాస్యాస్పదం. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. సంపూర్ణ మద్యనిషేధం తీసుకొస్తామని చెప్పి మాట తప్పారు. ఉద్యోగాలు, సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం ప్రతి అంశంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని వ్యక్తికి మ్యానిఫెస్టో గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ప్రజలను మోసం చేసినందుకు జగన్ రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి. ఏదైనా అక్రమం జరిగి ఉంటే ఆధారాలతో ముందుకు రావాలని మంత్రి నారా లోకేష్ బహిరంగంగా సవాలు విసిరారు. ధైర్యం ఉంటే చర్చకు రావాలి. అధికారిక వివరాలు బయటకు వచ్చిన తర్వాత వైసీపీ ఆరోపణల్లో నిజం లేదని స్పష్టమైంది. సంవత్సరం క్రితం జరిగిన ప్రక్రియపై ఇప్పుడు అకస్మాత్తుగా ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ కుట్ర మాత్రమే ఉంది. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. 2019లో అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేసిన విధానాన్నే మళ్లీ అమలు చేయాలని చూస్తున్నారు. అయితే ఈసారి ప్రజలు ఆ మోసాలకు అవకాశం ఇవ్వరు. వైసీపీ రాజకీయాల మూల సిద్ధాంతం ప్రజలను విభజించడం. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే దానికి కులరంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రతి అంశంపై బాధ్యతాయుతంగా స్పందిస్తోంది. ఆరోపణలు వచ్చిన వెంటనే విచారణలు జరిపి నిజానిజాలు బయటపెడుతోంది. రాష్ట్రంలో శాంతి, భద్రత, సామాజిక సామరస్య పరిరక్షణకు కట్టుబడి ఉంది. మత్స్య, ఆక్వా రంగాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విద్యుత్ చార్జీల తగ్గింపు, రైతులకు ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల కల్పన, అదనపు ఆర్థిక సహాయం వంటి చర్యలతో ఆక్వా రంగాన్ని లాభదాయకంగా మార్చింది. ప్రపంచ పరిస్థితులు, యుద్ధాల ప్రభావంతో కొన్ని ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తోంది. ఫీడ్ ధరలు, ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ పరిస్థితులపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. రైతులకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ఒక్క నిర్ణయం కూడా తీసుకోదు. హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకులు చేసిన వ్యక్తిగత, అవమానకర వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరం. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి గానీ వ్యక్తిగతంగా, మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదు. ఈ వ్యాఖ్యలపై సంబంధిత నాయకులు, జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర మహిళలకు మరియు హోం మంత్రికి క్షమాపణ చెప్పాలి. రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు అప్పుల ఊబిలోకి నెట్టి, అభివృద్ధిని అడ్డగించి, ప్రజలను విభజించే రాజకీయాలు చేసిన వైసీపీ ఇప్పుడు మళ్లీ అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. గత అనుభవాలను మరిచిపోలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోంది. అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత ప్రతి రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు కట్టుబడి ఉంది. ప్రజలు కూడా ఈ అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.




# సర్ పట్ల నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

**-జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డి**



కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించనున్న సర్ కార్యక్రమం పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) కె. వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల అకాడమీ బ్లాక్ 1 సమావేశ మందిరంలో బుధవారం రామగిరి, కమాన్ పూర్, ముత్తారం మండలాలకు చెందిన బిఎల్వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో కె. సురేష్, రామగిరి, కమాన్ పూర్ తహసిల్దార్లు పార్నంది సుమన్, ఎం వాసంతి, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ నియోజకవర్గంలో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ.




– డోర్నకల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. డా. బోడ అనిల్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు కిషన్ నాయక్, జిల్లా ఇన్‌చార్జి డా. శ్రీకాంత్, నియోజకవర్గ పరిశీలకులు అభిలాష్ గౌడ్, సీనియర్ నాయకురాలు మాధవి, మహబూబాబాద్ ఇన్‌చార్జి వేణు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ అజెండాలోని ఐదు ప్రధాన అంశాలు అయిన ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి కల్పన, వ్యవసాయాభివృద్ధి, “రైతే రాజు” లక్ష్యం మరియు సామాజిక తెలంగాణ నిర్మాణం గురించి గ్రామస్థాయిలో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సంపత్, హర్షిత్, సరోజ, దేవి, సంతోష్, వినయ్, రాందాస్, విజేందర్, వాసు, జస్వంత్, రాము తదితరులు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం పార్టీ నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా కార్యక్రమాన్ని కొనసాగించారు. జై టీఆర్ఎస్ జై తెలంగాణ అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

# పెండింగ్ కేసులకు చెక్ : ఎస్సై వెంకట్రాజం

వేములవాడ రూరల్ మండల ప్రజలు ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన, సులభంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు సమయం, ధనం ఆదా చేసుకోవడంతో పాటు దీర్ఘకాలిక న్యాయపరమైన వివాదాలకు ముగింపు పలకవచ్చని పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో సంబంధిత ఇరువర్గాలు సహకరించి, పరస్పర అవగాహనతో ముందుకు రావాలని కోరారు. రాజీ పడదగిన కేసుల్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ నిర్వహణకు సంబంధించిన కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు .

# స్పోర్ట్స్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

హకీంపేట లోని తెలంగాణ క్రీడా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి. వంటగది, డైనింగ్ హాల్, విద్యార్థుల బెడ్ రూమ్, పాఠశాల తరగతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేస్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థిని విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాల్సిన భోజనాన్ని అందించాలని, పరిశుభ్రతకు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. నూతనంగా హనుమకొండలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేయడమే కాకుండా గచ్చిబౌలి స్టేడియంలో, ఎల్బీ స్టేడియంలో నూతనంగా క్రీడా అకాడమీలు ఏర్పాటు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు క్రీడాంశాల్లో నూతన అకాడమీలో ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, క్రీడల ద్వారానే భావి సమాజం నిర్మించాలనుకుంటున్న ముఖ్యమంత్రి ఆశయాల మేరకు అధికారులు కోచులు సిబ్బంది పని చేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించమని, అన్ని అకాడమీ లను పాఠశాలను తరచుగా ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఎవరైనా విధుల్లో అ లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ద.

# ప్రజానాట్యమండలి పోరాట ఫలితమే గుర్తింపు కార్డుల మంజూరు :

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు ప్రవీణ్



– బుధవారం కళాకారులకు నిష్పక్షపాతంగా నిజమైన కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసిన సందర్భంగా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి ని ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి కార్యదర్శి పల్లె నరసింహ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కళాకారునికి గుర్తింపు తప్పకుండా లభిస్తుంది అని, ప్రభుత్వం చేపట్టిన ఈ మహోద్కార్యాన్నీ కళాకారులందరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు. మంగళవారం ప్రారంభ దశలో కొంతమందికి కార్డులు ఇవ్వడం జరిగింది. అదే వరసలో ప్రతి అర్హులైన కళాకారుడికి గుర్తింపు కార్డులు మంజూరు చేయుటకై ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని తెలిపారు.ఇంకా ఎవరైనా నమోదు చేయని వారు ఉంటే తమ వివరాలతో ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ మాట్లాడుతూ పదేళ్ల ప్రజానాట్యమండలి పోరాట ఫలితమే ఈ గుర్తింపు కార్డులు మంజూరు అని కేవలం గుర్తింపు కార్డులు ఇవ్వడంతో సరిపోదని కళాకారులకు ఆరోగ్య బీమా, బస్సుల్లో, రైళ్లలో రాయితీ, స్పోర్ట్స్ కోటాలో ఎలా ఐతే ఉద్యోగాలు కల్పిస్తారో అదేవిధంగా అర్హులైన వారికి కళారంగ కోటాను నిర్మించి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి కోశాధికారి నళిని, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమితి అధ్యక్షులు ప్రమీల, కార్యదర్శి వెంకటాచారి, సైదులు, అరుణ్, రామస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జీడిమెట్ల లోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేట్ సెక్యూరిటీ




వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పాఠశాల ఆస్తులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులకు, పోలీసులకు మధ్య సన్నిహిత సంబంధాలు పెంచడం, ప్రజలకు మరింత చేరువ కావడం కోసమే ఈ కార్యక్రమం చేపట్టాం అని తెలిపారు. సిఎస్ఆర్ సహకారం, ఫ్రిజ్లోనా పరిశ్రమ సహకారంతో జీడిమెట్ల ప్రాంతంలోని 5 ప్రభుత్వ పాఠశాలల్లో భద్రత ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ నియామకం ప్రతి పాఠశాలకు ఇద్దరు చొప్పున మొత్తం 10 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. వీరు పాఠశాల ఆస్తిని, పరిసరాల పరిశుభ్రతను కాపాడతారు అని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు పాఠశాలల్లో భద్రత పెంచేందుకు జీడిమెట్ల పోలీస్ శాఖ సహకరించింది. గతంలో వినాయక చవితి సందర్భంగా సేకరించిన 10 సీసీ కెమెరాలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎంఈఓ జెమినీ కుమార్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఫ్రిజ్లోనా కంపెనీ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్, ఎస్సై ప్రేమ్ సాగర్, శ్రీనివాస్, జీడిమెట్ల పోలీస్ సిబ్బంది, వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

**భవిష్యత్ హామీ..**భవిష్యత్తులో కూడా పాఠశాలలకు సెక్యూరిటీని కొనసాగిస్తామని ఫ్రిజ్లోనా కంపెనీ యాజమాన్యం ఈ సందర్భంగా ప్రకటించింది.

# నీటిమునిగే ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పరిధిలోని నీటిమునిగే ప్రాంతాల పరిస్థితిని సమీక్షించేందుకు జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సూపరింటెండింగ్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, హైడ్రా, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ, యూబీడీ శాఖల అధికారులతో కలిసి పలు నీటిమునిగే ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల పరిస్థితి, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, డ్రైనేజీల సామర్థ్యం, నీటి నిల్వకు కారణమయ్యే సమస్యాత్మక ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో వర్షాల సమయంలో నీటిమునిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలనీలలో వర్షపు నీరు నిల్వ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ కాలువలలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తక్షణమే తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని జోనల్ కమిషనర్ సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ, ట్రాఫిక్ అంతరాయాలు, ప్రజా అసౌకర్యాలను నివారించేందుకు అవసరమైన అన్ని నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసమే ఎల్వోసీ పత్రాల అందజేత : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్



పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ కింద కుత్బుల్లాపూర్ డివిజన్ వాజ్ పేయ్ నగర్ కి చెందిన కట్టా సాయికుమార్ తండ్రి కే.శ్రీనివాస్ రూ.2 లక్షలు, ఛండా చంద్రశేఖర్ తండ్రి లేట్ సీహెచ్. నారాయణ రూ.1.00 లక్షలు, సుభాష్ నగర్ డివిజన్ సూరారం రాజీవ్ గృహకల్ప కు చెందిన షేక్ నన్నే సాహెబ్ తండ్రి ఉన్నందు సాహెబ్ రూ.2.00 లక్షలు, నిజాంపేట్ సర్కిల్ లోని బత్తుల రజని భర్త బి.సత్యనారాయణ రూ.3.50 లక్షలు మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యాలయంలో లబ్ధిదార కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ పేదవారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రజా సేవకై పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్ అని అన్నారు. కావున అర్హులైన ప్రతీ పేదవారు మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నీట్ కటకటలు !

నీట్ ఏ ముహూర్తాన ప్రవేశ పెట్టారో కానీ ఎప్పుడూ సవ్యంగా సాగడం లేదు. ఈ నెల 21 తిరిగి నీట్ నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో పరీక్షాపత్రం సిద్ధం చేసిన వారిని రహస్య ప్రాంతంలో విడిది చేయించారు. వారికి ఫోన్, టివి లాంటివి అందుబాటులో లేకుండా రహస్యంగానే ఉంచారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకున్నప్పుడు ఎక్కడా లోపాలు లేవు. సాఫీగా ఎంసెట్ జరిగింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సాఫీగా సాగాయి. కానీ ఎప్పుడైతే జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశ పెట్టాక గందరగోళం, పేపర్ లీక్‌లు సర్వసాధరణంగా మారింది. తాజాగా మరోమారు పేపర్ లీక్ కావడంతో ఈ నెల 21వ తేదీన తిరిగి పరీక్షను నిర్వహించబోతున్నారు. ఇప్పుడు ప్రధాని కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం చూస్తున్నాం. హెలికాప్టర్లు, విమానాలు, సిఆర్‌పిఎఫ్ బలగాల రక్షణలో పరీక్ష నిర్వహించ బోతున్నారు. నిజానికి పరీక్షకు ప్రిపేర్ అయి గతంలోనే రాసిన అనేకమంది ఇప్పుడు తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న గందరగోళంలో పడ్డారు. మానసికంగా వారు ఒత్తడికి గురవుతున్నారు. యూపిపిఎస్సీ పరీక్షను సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు నీట్ పరీక్షను ఎన్‌టిఎ ఎందుకు సరిగా నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు గతంలోనే మొట్టి కాయలు వేసింది. నీట్ పరీక్షను పక్కాగా నిర్వహించడంలో విఫలం అయిన ఎన్‌టిఎపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న తీరు సమస్యగా మారింది. ఇకపోతే 21న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు నీట్–యూజీ పరీక్ష అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్ ప్రక్రియలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడ్మిట్‌కార్డులు నీట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ పరీక్షను నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించగానే.. విద్యార్థులు భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించారు. అయితే, పోర్టల్ తెరుచుకోవటానికి చాలా సమయం పడుతోందని, మధ్యలోనే నిలిచిపోతోందని, టైమ్‌ఔట్ ఎర్రర్స్‌ని చూపిస్తోందని అనేక మంది సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావటంలో ఇప్పటికే తాము తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటే.. ఈ సమస్యలు ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. అడ్మిట్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంటే.. ఫీజు రిఫండ్ అంశంలోనూ సమస్యలు తలెత్తాయని తెలిపారు. రిఫండ్ కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించిన తర్వాత కూడా.. వివరాలు ఇవ్వలేదంటూ వెబ్‌సైట్‌లో కనిపించిందని పలువురు వెల్లడించారు. మరికొందరు, తమకు తెలియకుండా.. రిఫండ్ అవసరం లేదనే ఆప్షన్‌ను సెలక్ట్ చేశామని, రిఫండ్ కోసం ఈ ఆప్షన్‌ను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏకు విజ్ఞప్తులు చేశారు. అడ్మిట్‌కార్డుల కోసం ప్రత్యామ్నాయ విధానాలను కూడా అందుబాటులో ఉంచాలని, బ్యాంకుఖాతాల ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయాలని పలువురు ఎన్‌టీఏకు సూచించారు. కాగా, ఈ ఫిర్యాదులపై ఎన్‌టీఏ సోమవారం స్పందిస్తూ.. విద్యార్థులు భారీ సంఖ్యలో సందర్శించటం వల్ల తమ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దటానికి నిపుణులు పని చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే 4 లక్షల మంది విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపింది. పేపర్ లీకేజీ, తిరిగి పరీక్ష నిర్వహణ నేపథ్యంలో నీట్ విద్యార్థులకు ఫీజును రిఫండ్ చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా.. ఓ సైబర్ నేరస్థుడు రిఫండ్‌ల మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించుకున్నాడు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ అనే వ్యక్తి నీట్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థుల అకౌంట్లను హ్యాక్ చేశాడు. రిఫండ్ కోసం ఆయా విద్యార్థులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో తన బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేశాడు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1700 చొప్పున వచ్చిన రిఫండ్ మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించాడు. దీనిపై ఓ విద్యార్థి తండ్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. నవీన్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాలను అమ్ముతామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులతో బేరసారాలు సాగిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సుమేర్‌సింగ్ మీనా, ఆకాశ్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రాం ఛానళ్ల ద్వారా వీరు నీట్ ప్రశ్నపత్రాల గురించి ప్రచారం చేశారని, రూ.1.5 కోట్ల మేర లావాదేవీలు జరిపారని వెల్లడైంది. ఇదిలావుంటే ఈ గందరగోళం నేపథ్యంలో ఒక పరీక్ష నిర్వాణకు ఇంతగా హంగామా ఎందుకని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత పోలీస్ అధికారి అన్నామలై ప్రశ్నించారు. పోలీసులు, హెలికాప్టర్ల వినియోగం వంటివన్నీ చేయడం, ప్రధాని కార్యాలయం సమీక్షించడం వంటివి వైఫల్యాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలపై సమీక్షించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న తీరుగా పటిష్టం చేయాలి. లేదా నీట్‌ను ఎత్తివేయడం మంచిది..

## విద్యుత్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి కరువు భత్యాన్ని (డీఏ) 1.62 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70,804 మంది ఉద్యోగులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరాలను వెల్లడించారు.

# 2.35 గ్రాముల హెరాయిన్ పట్టివేత






కోకాపేట ప్రాంతంలోని నర్సింగ్ గోశాల సమీపంలో గండిపేట ప్రాంతంలో డ్రగ్స్ అమ్ముతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ బి టీం సీఐ భిక్ష రెడ్డి, ఎస్ఐ బాలరాజులు కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 2.35 గ్రాముల హెరాన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వాసిమ్ అక్రం అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుని, హెరాయిన్ ని గండిపేట ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ బిక్షా రెడ్డి తెలిపారు.

# 62 గ్రాముల ఆశిష్ ఆయిల్ పట్టివేత



– కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని షాపూర్ నగర్ లో డ్రగ్స్ అమ్ముతున్నారని సమాచారం మేరకు రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ ఏ టీం సీఐ బాలరాజు సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 62 గ్రాముల హ్యాషిస్ ఆయిల్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో జెల్లా పృథ్వీరాజ్ అరెస్ట్ చేశారు. రాజకుమార్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదైనట్లు సిఐ తెలిపారు. నిందితున్ని హ్యాషిస్ ఆయిల్ని ఎక్సైజ్ స్టేషన్ కుత్బుల్లాపూర్ లో అప్పగించారు.

# విద్యా, గృహ రుణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## : అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

### జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

### జిల్లా ప్రణాళిక రూ: 4,82,936.64 కోట్లు

### ప్రాధాన్యత రంగానికి రూ.1,41,208.93 కోట్లు




జిల్లాలో విద్యా గృహ రుణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి బ్యాంక్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన డిసిసి, డి ఎల్ ఆర్ సి సమావేశానికి ఎల్ డి ఎం నరసింహ మూర్తి తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 2026–27 ను అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ బ్యాంకు నిర్దేశించిన రుణ లక్షాలకు అనుగుణంగా, లీడ్ బ్యాంకు ఆఫీస్ జిల్లాలోని బ్యాంకులకి వివిధ రంగాలకు కేటాయించిన వార్షిక రుణ లక్ష్యాలు రూ.4,81,936.64 కోట్లు, అందులో ప్రాధాన్యత రంగాలకు లక్ష్యాలు రూ:1,41,208.93 కోట్లు కేటాయించటం జరిగిందని అన్నారు. గత ఏడాది (2025–26) బ్యాంకులు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని బ్యాంకులు గత ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నందుకు బ్యాంకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఆర్.బి.ఐ దేవ్ ప్రియ, ఏజీఎం ఆర్బిఐ హేమలత, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, ఎల్ డి యం నరసింహ మూర్తి, వివిధ వాణిజ్య, సహకార, ఆర్ ఆర్ బి బ్యాంకుల కంట్రోలర్స్, ఇతర సీనియర్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ కేవైసీ పై పౌరసరఫరాలు జిల్లా అధికారి అధ్యక్షతన సమావేశం



కలెక్టర్ పౌరసరఫరాలు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాలు అధికారి అధ్యక్షతన సహాయ పౌరసరఫరాల అధికారి ఉప్పల్, బాలానగర్ సంబంధిత ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్స్, ఎల్పిజి డీలర్, మేనేజర్లు వారితో ఎల్పిజి వినియోగదారుల ఈ కేవైసీ పూర్తి చేయుట అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఎల్పీజీ వినియోగదారులందరూ తప్పనిసరిగా వారి వారి ఈ కేవైసీని తేదీ 30-06-2026 లోపల పూర్తి చేయవలసిందిగా కోరడమైనది. మొత్తం గ్యాస్ కనెక్షన్లు 14 లక్షలు 49వేల 460 అందులో 4లక్షల 32వేలు ఎల్పిజి కన్స్యూమర్స్ ఈ కేవైసీ పూర్తి చేయవలసి ఉన్నది కావున జిల్లాలోని సమస్త ఎల్పిజి వినియోదారులందరూ తప్పకుండా తమ ఈ కేవైసీని తేదీ 30-06-2026 లోపల పూర్తి చేయవలసిందిగా జిల్లా పౌరసరఫరాల అధికారి కోరారు.

# కత్తి పట్టిన ఆధునిక సీత

## అదరగొడుతున్న అలియా భట్ 'ఆల్ఫా' ట్రైలర్

**-ఆధునిక సీతగా అలియా భట్..**
**'ఆల్ఫా'గా యాక్షన్ అవతార్**
**-వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న కొత్త చిత్రం**
**-అలియా తండ్రిగా బాబీ డియోల్**
**కీలక పాత్రలో అనిల్ కపూర్**
**-'వార్' కబీర్‌గా అతిథి పాత్రలో మెరవనున్న హృతిక్ రోషన్**
**-జులై 3న థియేటర్లలోకి రానున్న 'ఆల్ఫా'**

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్ఎఫ్) తమ స్పై యూనివర్స్‌లో మరో కొత్త చిత్రాన్ని ప్రకటించింది. అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు 'ఆల్ఫా' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను తాజాగా విడుదల చేయగా, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రంలో అలియా భట్ 'సీత' అనే ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. చిన్నతనం నుంచే ఆమె తండ్రి (బాబీ డియోల్) ఒక కఠినమైన సీక్రెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆమెను ఒక కిరాయి హంతకురాలిగా తీర్చిదిద్దుతాడు. ఆధునిక కాలపు సీత తనదైన 'అగ్ని పరీక్ష'ను ఎలా ఎదుర్కొంది అనే థీమ్‌తో ఈ సినిమా సాగనుంది. టీజర్‌లో అలియా భట్ భీకరమైన యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. కత్తి యుద్ధాలు, ఛేజింగ్ సీన్లు ఆమె పాత్రలోని క్రూరమైన, భీకరమైన కోణాన్ని ఆవిష్కరించాయి. 18వ పుట్టినరోజునే ఆమెను 'ఆల్ఫా' అనే ఎలైట్ ఆపరేటివ్‌గా మార్చే సన్నివేశాలుసినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ సినిమాలో అలియా భట్‌తో పాటు మరో నటి శర్వరీ వాఘ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇద్దరు మహిళా ఆపరేటివ్‌లు కలిసి ఒక శక్తివం తమైన శత్రువును ఎలా ఎదుర్కొన్నారు అనేది కథలో కీలకం. సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఒక ముఖ్యమైన ఇంటెలిజెన్స్ అధికారి పాత్రలో నటిస్తుండగా, ఈ సినిమాకు అసలైన హైలైట్ హృతిక్ రోషన్ కావడం విశేషం. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లోని 'వార్' సిరీస్‌లో తను పోషించిన 'కబీర్' పాత్రలో హృతిక్ ఇందులో ప్రత్యేక అతిథిగా కనిపించనున్నారు. దీంతో ఈ సినిమా కూడా టైగర్, వార్ ఫ్రాంచైజీల ప్రపంచంలో భాగమని స్పష్టమైంది. 'ది రైల్వే మెన్' సిరీస్‌తో విమర్శకుల ప్రశంసలు పొందిన శివ్ రావల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య చోప్రా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో పూర్తిస్థాయిలో మహిళా ప్రధాన పాత్రలతో వస్తున్న తొలి భారీ యాక్షన్ చిత్రంగా 'ఆల్ఫా' నిలవనుంది. పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ పనుల్లో ఆలస్యం కారణంగా పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా జులై 3న విడుదల కానుంది.





## ఒక్క డీల్‌కే రూ.76 లక్షలు.. పార్టీకి రావాలంటే రూ.25 లక్షలు.. తన సంపాదన రహస్యం చెప్పిన ఓరీ!



సోషల్ మీడియా సంచలనం ఓర్హాన్ అవత్రమణి, అందరికీ 'ఓరీ'గా సుపరిచితుడు, తన సంపాదన గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అసలు ఓరీ ఏం పని చేస్తాడు, అతని ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందనే ప్రశ్నలకు ఎట్టకేలకు సమాధానం దొరికింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఓరీ, తన సంపాదన లెక్కలు బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు.కావ్యా కర్ణాటక్ హోస్ట్ చేసిన 'లెర్న్ బై కేకే క్రియేట్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, గతనెలలో కేవలం ఒక్క సోషల్ మీడియా డీల్ ద్వారానే రూ.76 లక్షలు సంపాదించినట్లు ఓరీ వెల్లడించాడు. "గత నెలలో నేను ఒకే ఒక్క డీల్‌పై, అంటే ఒక రీల్ ద్వారా రూ.76 లక్షలు సంపాదించాను" అని చెప్పడంతో, బ్రాండ్లు ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ కోసం ఎంత భారీగా ఖర్చు చేస్తున్నాయోనని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన సంపాదన కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాదని, ప్రైవేట్ ఈవెంట్లకు హాజరయ్యేందుకు కూడా తాను ఫీజు తీసుకుంటానని ఓరీ స్పష్టం చేశాడు. లంచ్, డిన్నర్, పుట్టినరోజు పార్టీలు లేదా పెళ్లిళ్లకు హాజరయ్యేందుకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఛార్జ్ చేస్తానని తెలిపాడు. తనదైన శైలిలో మాట్లాడుతూ, "రూ.15 నుంచి 25 లక్షలకు మీరు నన్ను లంచ్‌కు, డిన్నర్‌కు కొనుక్కోవచ్చు. మీ పెళ్లికి వస్తాను, పుట్టినరోజు పార్టీకి వస్తాను. మనం చిన్ననాటి స్నేహితులం అన్నట్లు స్పీచ్ ఇస్తాను. మీ తల్లిదండ్రులతో కలిసి షాట్స్ తాగుతాను. మీరు కోరుకున్న ప్రతి ఒక్కరితో కలిసి ఫోటోలు దిగుతాను. ఇది మీరు కొనుక్కోగల ఒక అనుభవం" అని వివరించాడు.

## మెగాస్టార్ చిరంజీవి వ్యక్తిత్వంపై జగపతిబాబు ప్రశంసలు



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఒక ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవి గురించి పంచుకున్న కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. జగపతిబాబు హీరోగా పరిచయమైన తొలి సినిమా 'సింహ స్వప్నం'. ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టాల్సిందిగా కోరడానికి జగపతిబాబు, ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్ కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారట. అప్పట్లో చిరంజీవి గారు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా, స్టార్‌డమ్‌లో పీక్స్‌లో ఉన్నప్పటికీ.. వీరిని ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారట. అంతేకాదు, జగపతిబాబును చూడగానే "చాలా అందంగా ఉన్నావు" అని మెచ్చుకుని, అడగడమే ఆలస్యం వెంటనే వచ్చి సినిమా ప్రారంభోత్సవానికి క్లాప్ కొట్టారని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. ఇక ఆ సంఘటన జరిగిన దాదాపు 35 సంవత్సరాల తర్వాత, 'పెద్ది' సినిమాలో జగపతిబాబు పోషించిన పాత్రను చూసి చిరంజీవి మళ్లీ అదే స్థాయిలో ఫోన్ చేసి మరీ ప్రశంసించారట. చిరంజీవిలోని ఆ గొప్ప గుణాన్ని జగపతిబాబు ఈ ఇంటర్వ్యూలో ఎంతో సంతోషంగా పంచుకున్నారు. ఒకప్పుడు హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించిన జగపతిబాబు, ప్రస్తుతం వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, పవర్‌ఫుల్ విలన్‌గా తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతున్నారు.

# భారత్‌కు క్రిస్టోఫర్ నోలన్ రాక

## ముంబైలో 'ది ఒడిస్సీ' గ్రాండ్ ప్రీమియర్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు, ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు ఇది ఒక శుభవార్త. 'ఓపెన్‌హైమర్', 'ఇంటర్‌స్టెల్లార్', 'ఇన్‌సెప్షన్', 'ది డార్క్ నైట్' వంటి అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టనున్నారు. తన సరికొత్త చిత్రం 'ది ఒడిస్సీ' ప్రీమియర్ కోసం ఆయన జులైలో ముంబైకి రానున్నట్లు యూనివర్సల్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నోలన్‌తో పాటు ఆ చిత్రంలో నటించిన ఆస్కార్ విజేత మ్యాట్ డామన్, ప్రముఖ నటుడు టామ్ హాలండ్, ఆస్కార్ అవార్డు గ్రహీత, నిర్మాత ఎమ్మా థామస్ కూడా హాజరుకానున్నారు. క్రిస్టోఫర్ నోలన్ సినిమా ఒకటి భారతదేశంలో ప్రీమియర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జులై 17న థియేటర్లలోకి రానుంది.'ది ఒడిస్సీ' గ్లోబల్ ప్రీమియర్ టూర్‌లో భాగంగా లండన్, పారిస్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాలతో పాటు ముంబైని కూడా అధికారికంగా ఎంపిక చేయడం భారతీయ మార్కెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. హోమర్ రచించిన ఇతిహాసం 'ఒడిస్సీ' ఆధారంగా ఈ చిత్రాన్ని నోలన్ తెరకెక్కించారు. ట్రాయ్ పతనం తర్వాత ఒడిస్సియస్ పదేళ్లపాటు తన ఇంటికి తిరిగి వెళ్లే ప్రయాణాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చూపించనున్నారు.ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. సరికొత్త ఐమ్యాక్స్ ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన మొట్టమొదటి ఫీచర్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. ముంబైలోని ఫీనిక్స్ పల్లాడియంలో ఉన్న పీవీఆర్ ఐకాన్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఈ ప్రీమియర్ వేడుక జరగనుంది.ఈ చిత్రంలో మ్యాట్ డామన్, టామ్ హాలండ్‌లతో పాటు ఆన్ హాత్వే, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, జెండాయా, చార్లీజ్ థెరాన్ వంటి భారీ తారాగణం నటించింది. నోలన్, ఎమ్మా థామస్ తమ సింకోపీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే భారతదేశంలోని పలు సినిమా థియేటర్లలో 'ది ఒడిస్సీ' ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అడ్వాన్స్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత గడ్డపై జరుగుతున్న అతిపెద్ద హాలీవుడ్ ఈవెంట్‌లలో ఒకటిగా ఈ ప్రీమియర్ నిలవనుంది.




# 'రమణి కల్యాణం' (ఈటీవీ విన్) మూవీ రివ్యూ!

సూర్య వశిష్ఠ – దీప్సిక చంద్రన్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'రమణి కల్యాణం'. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 22వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఈ నెల 12వ తేదీ నుంచి 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. సంజన (దీప్సిక) చూపులేని అమ్మాయి. తల్లిదండ్రులను కోల్పోయిన ఆమె, బామ్మ దగ్గరే పెరుగుతుంది. అనాథలైన నలుగురు పిల్లలను దత్తత చేసుకుని వాళ్ల ఆలనా పాలనా చూస్తుంటుంది. ఒక వైపున పబ్ లో సింగర్ గా.. మరో వైపున ఒక ఎఫ్ ఎమ్ రేడియోలో ఆర్జేగా పనిచేస్తుంటుంది. తనకి చూపు లేకపోవడాన్ని ఒక లోపంగా భావించడం ఆమెకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతుంటుంది. అలాంటి సమయంలోనే ఆమెకి రాజ్ (సూర్య వసిష్ఠ) తారసపడతాడు. రాజ్ మంచి కవి అతని రెండు కాళ్లూ పనిచేయవు. అందువలన అతను వీల్ ఛైర్ కి పరిమితమవుతాడు. అనాథగా మిగిలిపోయిన రాజ్ ను అతని స్నేహితులైన కిశోర్ – గీత (శ్రీనివాసరెడ్డి – శ్యామల) దంపతులు చూసుకుంటూ ఉంటారు. రెండు కాళ్లను కోల్పోయిన కారణంగా రాజ్ చాలా డీలాపడిపోతాడు. పోయింది నడక మాత్రమే తప్ప, భవిష్యత్తు కాదనే సంజన మాటలు అతనిలో కొత్త ఆశలను రేకెత్తిస్తాయి. వాళ్లిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. సంజనకి చూపులేని కారణంగా సంబంధాలు రావడమే కష్టమై పోతుంది. వచ్చిన సంబంధాలు ఆమె పెంచుతున్న పిల్లల కారణంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆమె రాజ్ ను ప్రేమించడం బామ్మకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఇక ఒంటరిగా మిగిలిపోయిన దగ్గర నుంచి కుమిలిపోతున్న రాజ్, సంజన రాకతో సంతోషంగా ఉండటం కిశోర్ దంపతులకు ఆనందాన్ని ఇస్తుంది. సంజన – రాజ్ పెళ్లి చేసుకుందామని అనుకుంటూ ఉండగా ఒక అనూహ్యమైన సంఘటన జరుగుతుంది. అదేమిటి? అది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.చూపులేని అమ్మాయి .. కాళ్లు లేని అబ్బాయి. ఒకరు కవి అయితే .. మరొకరు గాయని. అలాంటి ఈ ఇద్దరి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ఇద్దరూ ఆయా సందర్భాలలో తల్లిదండ్రులను కోల్పోయినవారే. అలాంటి ఆ ఇద్దరూ కలిసి నడవాలని అనుకుంటారు కలిసి బతకాలని నిర్ణయి ంచుకుంటారు.



సన్నిహితు లంతా వాళ్ల నిర్ణయం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి ఆ సమయంలో ఏం జరిగిందనే ఒక అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com